Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

PRAJA TELEVISION
The People's Favour
మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి
8309979541
రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 128 | హైదరాబాద్ | మంగళవారం 31 మార్చి 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## అన్నీ పేల్చేస్తాం!

**ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫైనల్ వార్నింగ్**

**తిరస్కరించినా, హోర్ముజ్ తెరవకపోయినా సర్వనాశనమే**

**విద్యుత్ కేంద్రాలు, ఇంధన స్థావరాలు, ఖర్గ్‌ని భస్మం చేస్తాం.. ట్రూత్‌లో ట్రంప్ తాజా పోస్ట్**

వాషింగ్టన్/టెహ్రాన్/ఇస్లామాబాద్, మార్చి 30: ఇరాన్‌తో చర్చల్లో గొప్ప పురోగతి సాధించామని, కానీ ఏ కారణం చేత నైనా త్వరలో ఒప్పందం కుదరకపోయినా.. హోర్ముజ్ జలసంధిని వెంటనే తెరవకపోయి నా, ఇరాన్‌లోని అన్ని విద్యుత్ ఉత్పాదక కేంద్రాలు, ఇంధన బావులు, ఖర్గ్ ద్వీపాన్ని, డీశాలినేషన్ ప్లాంట్లను పేల్చివేస్తామని అమెరికా అధ్యక్షుడు

- మిగతా 2వ పేజీలో



## గెలవలేని యుద్ధం!

నేటి ఇరాన్‌ను పూర్వం పర్షియాగా వ్యవహరించేవారు. క్రీస్తు పూర్వం నాలుగువేల సంవత్సరాల నుంచి పరిఢవిల్లుతున్న నాగరికత ఆ నేలది. వ్యూహాత్మక ప్రాంతంలో ఉన్న ఇరాన్‌కు అపార సహజ వనరులు, ఘనమైన సాంస్కృతిక వారసత్వం ఉంది. శతాబ్దాలుగా దక్షిణాసియా, మధ్య ఆసియాలోని అనేక భాషలపై పారశీక భాష ప్రభావమూ అపారం. ఇదే సమయంలో, పొరుగు దేశాలతో ఇరాన్‌కు సరైన సంబంధాలు మాత్రం లేకపోవడం గమనార్హం. మధ్య ఆసియా దేశాలన్నీ తుర్క్ మూలానికి చెందినవైనా, పారశీ పర్షియన్ భాషా సంస్కృతుల ప్రభావానికి లోనయ్యాయి. భారత్‌లో మొఘలుల పాలనలో పారశీకం రాజభాషగా ఉండటంతో అన్ని భారతీయ భాషలపై దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. భారత్-ఇరాన్ శతాబ్దాలుగా నాగరికత సంబంధాలను కలిగి ఉన్నాయి. మహారాజా రంజిత్ సింగ్

- మిగతా 2వ పేజీలో

## ఆహార కల్తీపై ఉక్కుపాదం

**ఈగల్, హైడ్రా తరహాలో ప్రత్యేక వ్యవస్థ**

**విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడమే లక్ష్యం**

**పంటల మార్పిడిపై రైతుల్లో అవగాహన తీసుకురావాలి**

**సన్నబియ్యంతో పాటు.. మరిన్ని నిత్యావసరాలను అందించే ప్రణాళిక**

**50% సీట్ల పెంపుతో దక్షిణాదికి నష్టం**

**మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్**




రాష్ట్రంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా.. శాసనసభ భవనంలో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో సోమవారం సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

మార్చి 30 (ప్రజాతీర్పు)

రాష్ట్రంలో ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆహార కల్తీ నియంత్రణకు ఈగల్, హైడ్రా తరహాలో ప్రత్యేక వ్యవస్థను తీసుకురానున్నట్లు ప్రకటించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల చట్టాలను అధ్యయనం చేసి.. తెలంగాణకు తగిన పకడ్బందీ వ్యవస్థ రూపొందిస్తామన్నారు. పేదలకు కడుపునిండా అన్నం పెట్టాలనే బృహత్తర లక్ష్యంతో ప్రారంభించిన సన్నబియ్యం పథకం విజయవంతమైందని, తదుపరి లక్ష్యం దిశగా దృష్టి సారించామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, సాంకేతికతల పెంపుతో పాటు.. పౌష్టికాహారం అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. "రైతుకు తాను పండించిన పంటకు న్యాయమైన ధర నిర్ణయించే హక్కు లేకపోవడం పెద్ద శాపమని ఆందోళన వ్యక్తంచేశారు. ఇందుకోసమే కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. పంటల మార్పిడి విధానం ద్వారా వాణిజ్య పంటల సాగు విస్తీర్ణం పెంచడం, జిల్లాల వారీగా శాస్త్రీయ అధ్యయనానికి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయడం ద్వారా రైతుకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా..

- మిగతా 2వ పేజీలో



## చొరబాటు.. ఎన్నికల అంశం కాదు

**అది జాతీయభద్రతాంశం**

**అస్సాంలో పరిస్థితిపై ప్రధాని మోదీ వ్యాఖ్య**

**అస్సాం బూత్‌లెవల్ పార్టీ కార్యకర్తలతో వర్చువల్‌గా భేటీ**

న్యూఢిల్లీ: అస్సాంను సమస్యగా పరిణమించిన చొరబాటు అంశాన్ని కేవలం ఎన్నికల్లో ప్రచారాంశంగా చూడొద్దని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. అక్రమ చొరబాట్లు అనేవి దేశ పౌరుల గుర్తింపునకు, జాతీయ భద్రతకు గొడ్డలిపెట్టుగా తయారవుతోందని ప్రధాని ఆందోళన వ్యక్తంచేశారు. మరో పది రోజుల్లో అస్సాంలో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సోమవారం రాష్ట్రంలోని బూత్ స్థాయి బీజేపీ కార్యకర్తలతో 'మేరా బూత్, సబ్‌సే

- మిగతా 2వ పేజీలో

## మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

**మైనింగ్, భూకబ్జాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి**

**సాక్ష్యాధారాలతో గవర్నర్‌కు బీఆర్ఎస్ శాసనసభా పక్షం ఫిర్యాదు**

**రాఘవ కన్‌స్ట్రక్షన్స్ భాగోతంపై సభాసంఘం వేయాలి**

**రేవంత్ కంటే బ్లాక్‌మెయిలర్ ఎవరూ లేరు: కేటీఆర్**



హైదరాబాద్, మార్చి 30 (ప్రజాతీర్పు)

మైనింగ్ అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి వెంటనే బర్ఫ్ చేయాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం డిమాండ్ చేసింది. ఆయన అక్రమాలపైన ఇండిపెండెంట్ జ్యుడీషియల్ ఎంక్వైరీ, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. మంత్రి పొంగులేటి అక్ర మ మైనింగ్, భూకబ్జాలపైన విచారణ చేపట్టాలని బీఆర్ఎస్

- మిగతా 2వ పేజీలో



## కరడుగట్టిన నక్సలిజం ఖతం

**తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో 21 రోజుల భీకర పోరు..**

న్యూఢిల్లీ: దశాబ్దాలపాటు దేశాన్ని, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలను వణికించిన వామపక్ష తీవ్రవాదం (నక్సలిజం) దాదాపు అంతమైందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం లోక్‌సభ సాక్షిగా ప్రకటించారు. ముఖ్యంగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కేంద్ర బలగాలు చేపట్టిన చరిత్రాత్మక 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్' విజయవంతం కావడంతో తెలంగాణ పూర్తిస్థాయిలో నక్సల్స్‌రహిత రాష్ట్రంగా మారిందని చెప్పారు. దేశవ్యాప్తంగా నక్సలిజాన్ని పారదోలేందుకు భద్రతా బలగాలు చేసిన త్యాగాలను కొనియాడుతూ సభలో సెల్యూట్ చేశారు. అదే సమయంలో వామపక్ష తీవ్రవాదానికి దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ, గాంధీ కుటుంబం ఏ విధంగా అండగా నిలిచిందో వివరిస్తూ

- మిగతా 2వ పేజీలో




## జనగణన తొలి దశ రేపటి నుంచి..

**33 ప్రశ్నలతో సమాచార సేకరణ**

**వ్యక్తిగత డేటా గోప్యతకు పూర్తి భద్రత**

**కులం వివరాలు రెండో దశలో..**

**సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ వెల్లడి**

దిల్లీ: జనగణన మహాయజ్ఞంలో తొలి భాగమైన గృహగణన బుధవారం దేశవ్యాప్తంగా ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన వివరాలను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా, సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్‌కుమార్ నారాయణ్

- మిగతా 2వ పేజీలో

## ఆల్‌టైమ్ కనిష్ఠానికి భారత కరెన్సీ



**ఇంట్రాడేలో ఒక దశలో 95.22 స్థాయికి**

**15 పైసల లాభంతో 94.7 వద్ద ముగింపు**

**పశ్చిమాసియా యుద్ధంతో 4.1 శాతం నష్టపోయిన రూపాయి**

**2025-26 ఆర్థిక సంవత్సరంలో 10 శాతం పతనం**

**14 ఏళ్లలో ఇదే అతిపెద్ద వార్షిక క్షీణత**

-2లో

# ఆల్‌టైమ్ కనిష్ఠానికి భారత కరెన్సీ

ముంబై: భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠానికి జారుకుంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం ఒక దశలో రూ.95.22 వద్దకు చేరుకుంది. డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.95 స్థాయిని దాటడం ఇదే తొలిసారి. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 115 డాలర్లకు ఎగబాకడంతో పాటు డాలర్ బలపడటం, మన ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, ఎఫ్ఐఐల అమ్మకాలు ఇందుకు ప్రధాన కారణమని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. ముడి చమురు ధరలు దీర్ఘకాలం పాటు గరిష్ఠ స్థాయిలోనే కొనసాగితే డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.100 దిశగా పయనించనుందని వారన్నారు. ఆరంభంలో లాభాలు: క్రితం వారాంతంలో 89 పైసలు క్షీణించి రూ.94.85 వద్ద ముగిసిన డాలర్-రూపాయి మారకం విలువ.. సోమవారం ట్రేడింగ్‌లో రూ.93.62 వద్ద ప్రారంభమైంది. మరింత బలపడి రూ.93.57 వద్దకు చేరుకుంది. అంటే, గత శుక్రవారం ముగింపుతో పోలిస్తే 128 పైసలు బలపడింది. బ్యాంకుల అమెరికన్ కరెన్సీ ఓవర్‌నైట్ నెట్ ఓపెన్ పొజిషన్స్‌ను 10 కోట్ల డాలర్లకు తగ్గిస్తూ ఈ నెల 27న ఆర్‌బీఐ సర్క్యులర్ జారీ చేయడం ఇందుకు దోహదపడింది. అయితే, ఆర్‌బీఐ చర్య రూపాయిని ఎంతోసేపు ఆదుకోలేకపోయింది. కార్పొరేట్ సంస్థలు భారీగా డాలర్లను కొనుగోలు చేయడంతో మన కరెన్సీ మళ్లీ జారుకోవడం మొదలు పెట్టింది. ఒక దశలో ఎక్స్ఛేంజ్ రేటు రూ.95.22 వద్దకు చేరుకుంది. చివర్లో మళ్లీ తేరుకుంది. క్రితం క్లోజింగ్‌తో పోలిస్తే, 15 పైసల లాభంతో రూ.94.70 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూపాయి మారకం విలువ 165 పైసల శ్రేణిలో ఊగిసలాడింది.

# అన్నీ పేల్చేస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. మరోవైపు యుద్ధం ముగించడానికి అమెరికాతో చర్చల విషయంలో పాకిస్తాన్ మధ్యవర్తిత్వాన్ని ఇరాన్ తిరస్కరించింది. ఆ ఆతిథ్య వేదికలు వారి సొంతమని, వాటితో తమకు సంబంధం లేదని స్పష్టంచేసింది. ఇంకోపక్క అమెరికాతో ప్రత్యక్ష చర్చ లు ఇప్పటివరకు జరగలేదని ముంబై ఇరాన్ కాన్సులేట్ వెల్లడించింది. దీంతో పశ్చిమాసియాలో యుద్ధం ఇప్పట్లో ఆగే పరిస్థితులు కన్పించడం లేదు. ఇరాన్‌తో డీల్ క్యాన్సిల్ అయితే ఆ దేశ ఆర్థిక వనరులను అన్నింటినీ భస్మం చేస్తామని ట్రంప్ ఫైనల్ వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ట్రూత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇరాన్‌తో తమ సైనిక కార్యకలాపాలను ముగించడానికి ఒక కొత్త, మరింత హేతుబద్ధమైన ప్రభుత్వంతో తీవ్రమైన చర్చలు జరుపుతున్నట్లు ఇందులో వెల్లడించారు. అయితే చర్చలు విఫలమై, హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవకపోతే, ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలను, ఇంధన బావులను, ఖర్గ్ ద్వీపాన్ని పేల్చివేస్తామని హెచ్చరించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్‌తో కలిసి యుద్ధం ప్రారంభించిన అమెరికాకు ఇప్పుడు దాన్నుంచి ఎలా బయటపడాలో తెలియడం లేదు. ఈ నేపథ్యంలో ఇరాన్ 48 గంటల్లో సీజ్ ఫైర్ ఒప్పందానికి రాకపోతే విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామని అల్టిమేటం ఇచ్చిన ట్రంప్ వెనక్కి తగ్గారు. ముందు ఐదు రోజులు సమయం ఇచ్చానని చెప్పిన ట్రంప్.. ఆ తర్వాత దాన్ని మరో పది రోజులకు పొడిగించారు. అయినా ఇరాన్ లొంగకపోవడంతో సోమవారం మరింత ఘాటు హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లో 47 సంవత్సరాల భయానక పాలనలో తమ సైనికుల మరణానికి ప్రతీకార చర్యగా ఇది ఉంటుందన్నారు. ఇరాన్‌తో చాలా కాలంగా కోరుకుంటున్న అనేక లక్ష్యాలను అమెరికా సైన్యం ఛేదించిందని తెలిపారు. యుద్ధం ముగించే లక్ష్యంతో తాము విధించిన షరతులకు ఇరాన్ స్థూలంగా అంగీకరించిందని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉంటే ఇరాన్, ఇజ్రాయెల్- అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధానికి నెల రోజులు పూర్తయ్యింది. రోజు రోజుకూ తీవ్రమవుతోన్న యుద్ధాన్ని ఆపేందుకు పాకిస్థాన్, ఈజిప్ట, టర్కీ, సౌదీలు తాము మధ్యవర్తిత్వం వహిస్తామని ముందుకొచ్చాయి. ఈ చర్చలకు పాక్ ఆతిథ్యం ఇవ్వడానికి ఆసక్తి చూపుతోంది. దీంతో ఈజిప్ట్, టర్కీ, సౌదీ విదేశాంగ మంత్రులతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసింది. దీనిపై ఇరాన్ స్పందిస్తూ.. పాక్ వేదికలు వారి సొంతమని, వాటితో తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది.

# గెలవలేని యుద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

తన అఫ్గానిస్థాన్ దండయాత్రల సమయంలో టెహ్రాన్‌దాకా వెళ్లి అక్కడి పాలకులను కలిశారు. నాదిర్ షా దోచుకున్న ప్రసిద్ధ నెమలి సింహాసనం (తఖ్త్-ఎ-తావూస్) ఇప్పటికీ టెహ్రాన్‌లో ప్రదర్శనలో ఉంది. ఆయతుల్లా రుహుల్లా ఖొమేనీ నాయకత్వంలో 1979లో ఇస్లామిక్ విప్లవం జరిగిన తరవాత నుంచి ఇరాన్ 'ఇస్లామిక్ రిపబ్లిక్'గా మారింది. అంతకుముందు రాచరిక పాలనలో పాశ్చాత్య దేశాలతో, ముఖ్యంగా ఫ్రాన్స్, అమెరికాలతో సన్నిహితంగా ఉండేది. రాజు షా రెజా పహ్లవి తన పట్టాభిషేకాన్ని తాజ్‌మహల్ దగ్గర జరుపుకోవడానికి భారత ప్రభుత్వాన్ని అనుమతి కోరగా, న్యూదిల్లీ అప్పట్లో మర్యాదపూర్వకంగానే తిరస్కరించింది. నాలుగు దశాబ్దాల క్రితం ఇస్లామిక్ విప్లవం వచ్చినప్పటి నుంచి ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇండియన్ ఫారిన్ సర్వీస్‌లో చేరిన తరవాత, 1995లో మొదటి పోస్టింగ్‌లో భాగంగా టెహ్రాన్‌కు వెళ్లినప్పుడు అమెరికా, ఇజ్రాయెల్‌లకు వ్యతిరేకంగా ఇరానియన్ల ప్రదర్శనలు, నిప్పులు చెరిగే ప్రసంగాలను వీక్షించేవాణ్ని. అవీ, ప్రార్థనా కార్యక్రమాలు ప్రజలపై నిర్బంధంగా రుద్దినవే తప్ప, మెజారిటీ ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నవి కావనేది నిష్ఠుర సత్యం. స్త్రీలు హిజాబ్ ధరించడం, పురుషులు గడ్డాలు పెంచడం వంటి నియమాలను మతపాలకులు కఠినంగా అమలు చేసేవారు. పార్కుల్లో ప్రియులతో కనిపించే యువతులకు 'కోమ్' నగరంలోని వృద్ధ మతాధికారులతో పెళ్లిళ్లు చేయడం, అర చొక్కాలు ధరించే పురుషులకు నలుపు రంగు పూయడం వంటి కఠిన శిక్షల అమలు గురించి నేను విన్నాను, చూశాను కూడా. మతపరమైన ఈ ఆంక్షలన్నీ శాస్త్రీయ, వాణిజ్య అభివృద్ధికి అడ్డంకిగా మారాయని ఇరాన్ యువతరం చిరకాలంగా భావిస్తోంది. గత నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులు చేసిన నిరసనలను ప్రభుత్వం మరణ, జైలుశిక్షలతో అణచివేసింది. అమెరికా, ఐరోపాల ఆర్థిక ఆంక్షల వల్ల తలెత్తిన ఆర్థిక సంక్షోభం, కరెన్సీ విలువ పడిపోవడం ఇరాన్ వ్యాపార వర్గాల్లో అసంతృప్తికి దారితీసింది. ఆ క్రమంలో అనేక తిరుగుబాటు ప్రయత్నాలు జరిగినా విఫలమయ్యాయి. తాజా యుద్ధంలో సుప్రీం నేత ఖమేనీని హతమార్చినప్పుడు పాలన మారుతుందని అమెరికాతోపాటు కొందరు భావించినా జరగలేదు. ట్రంప్ సర్కారు ఇరాన్ అంతర్గత వ్యవస్థల బలాన్ని తక్కువగా అంచనా వేసింది. ఇరాన్‌కు యుద్ధాలు కొత్త కాదు. ఇరాక్‌తో దశాబ్ద కాలం పాటు యుద్ధం చేసినా స్థిరంగా నిలబడింది. మరోవైపు గల్ఫ్‌లోని సున్నీ దేశాలు షియా ఇరాన్‌ను ఎదుర్కోవడానికి ఇజ్రాయెల్‌కు దగ్గరయ్యాయి. ఆంక్షల నడుమే తన చమురు ఉత్పత్తిని కొనసాగించిన ఇరాన్ ఏమో చైనా, రష్యాలతో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకుంది. భారత్‌లో బాబ్రీ మసీదు కూల్చివేతపై ఇరాన్ మతపరంగా అసంతృప్తి వ్యక్తం చేసింది.

## చొరబాటు.. ఎన్నికల అంశం కాదు

(మొదటి పేజీ తరువాయి)

మజ్‌బూత్ సంవాద్'కార్యక్రమంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా భేటీ అయ్యారు. "అస్సాంలో తొలిసారిగా ఓటేసే యువ ఓటర్లు రాష్ట్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వాల అసమర్థ పాలనలను ఒకసారి గుర్తుచేసుకోండి. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేసినా మీరు చేసే ఈ తప్పు రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతిపథం నుంచి పక్కకు తప్పిస్తుంది. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టేలా బీజేపీ కార్యకర్తలు బాగా శ్రమించాలి. చొరబాట్లు అనేవి కేవలం ఎన్నికల అంశం కానేకాదు. అస్సాం రాష్ట్ర గుర్తింపు పరిరక్షణకు సంబంధించిన అంశమిది. చొరబాటుదారులు అక్రమంగా భూములను లాక్కునేలా కాంగ్రెస్ ప్రోత్సహించింది. చొరబాటుదారులు ఒక్కసారి రాష్ట్రంలో స్థిరనివాసం ఏర్పర్చుకున్నారంటే అక్కడి చిరువ్యాపారాలను తమపరంచేసుకుంటారు. దాంతో స్థానికుల జీవనోపాధి కష్టమవుతోంది. ఆక్రమణను కాంగ్రెస్ ప్రోత్సహిస్తే బీజేపీ వాటిని అడ్డుకుంది. ఈశాన్య భారతంలో కేంద్రప్రభుత్వం శాంతిస్థాపన కోసం వేర్వేరు సంస్థలతో 12 శాంతి ఒప్పందాలను కుదుర్చుకుంది. అదే కాంగ్రెస్ ఒప్పందాలను కాగితాలకే పరిమితంచేసింది. కేవలం ఆర్భాటం చేస్తూ పత్రికల్లో పతాక శీర్షికలకెక్కి ప్రజలను తప్పుదోవపట్టించింది. కాంగ్రెస్‌పాలనలో అస్సాం హింసతో రగిలిపోయింది.

# ఆహార కల్తీపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)



శాసనసభ భవనంలో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో సోమవారం సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఇందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మండలి కమిటీ హాలులో మంత్రులు ఉత్తమ్, అడ్లూరి లక్ష్మణ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అయిలయ్య తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

### 100 శాతం సన్నబియ్యం ఇవ్వడానికి సిద్ధం

"నలభై ఏళ్లుగా తెలంగాణ పేదలకు రేషన్ ద్వారా దొడ్డుబియ్యమే పంపిణీ అవుతూ వచ్చింది. దీంతో ఆ బియ్యాన్ని సన్నాలుగా మార్చే మాఫియా విస్తరించింది. ఈక్రమంలో పేదలు తినగలిగే సన్నబియ్యం ఇవ్వాలని ప్రజాప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ జనాభాలో 86 శాతం మంది ప్రజలు ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారు. భవిష్యత్తులో ఇది 90 శాతాన్ని అధిగమించవచ్చు. 100 శాతం మంది ఈ పథకం పరిధిలోకి వచ్చినా.. వారికి సన్నబియ్యం అందజేయడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సోనియా గాంధీ తీసుకొచ్చిన జాతీయ ఆహార భద్రతా చట్టానికి రాష్ట్రంలో సరైన న్యాయం జరగాలని సంకల్పించాం. పిల్లలు ఆరోగ్యంగా, చదువులో రాణించాలంటే పుష్టికరమైన ఆహారం అవసరం. అందుకే వ్యవసాయ వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తున్నాం. పేదల ఆకలి తీర్చడం, రైతుకు న్యాయం చేయడం, కల్తీ మాఫియాను అదుపు చేయడం.. ఈ 3 లక్ష్యాలతో ముందుకెళుతున్నాం. సన్నబియ్యానికి అయ్యే ఆర్థికభారం కేంద్రం భరిస్తే.. ప్రధాని మోదీ బొమ్మ పెట్టి పంపిణీ చేస్తాం.

### రైతులకు ఆర్థిక బలం

సన్న బియ్యం పథకం అమలు చేయాలంటే.. ఇక్కడే ఉత్పత్తి పెరగాలి. అందుకే సన్నాల సాగుకు ప్రోత్సాహకంగా క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించాం. ఎకరాకు ఏడాదికి రూ.25,000 లాభాన్ని అదనంగా అందించాం. ఆ పంటను ఇక్కడే కొని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్నాం. సన్నబియ్యం పథకం రైతులకు ఆర్థిక బలాన్ని చేకూరుస్తోంది. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నాం. నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే తీవ్రమైనది. ప్రజల ఆకలిని సొమ్ము చేసుకునే వారిని నియంత్రించేందుకు.. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బందీ చట్టాలు తీసుకొచ్చింది. నేడు పటిష్ఠ నిఘా వ్యవస్థ నెలకొల్పనుంది. దేశంలో నిత్యావసర ధరలు తెలంగాణలోనే అతి తక్కువగా ఉన్నాయి. అన్నదాతల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వమే గతంలో కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చింది. వరితో పాటు.. వాణిజ్య, పోషకాహార పంటల వైపు రైతులను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందుకోసం ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, ఆ శాఖ అధికారులతో కలిసి టాస్క్‌ఫోర్స్ కమిటీ వేయాలని యోచిస్తున్నాం. ఈ కమిటీ జిల్లాల వారీగా పంటల మార్పిడి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తుంది. రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యంతో పాటు.. ఇతర నాణ్యమైన నిత్యావసరాలను అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పుడు రాష్ట్రాల్లో ఉన్న పార్లమెంటు సీట్లను 50 శాతం పెంచాలనే కేంద్ర ప్రభుత్వం ఆలోచన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణలో ఉత్తర, దక్షిణ భారతాలకు ఇప్పుడున్న విధంగానే అంతరం ఉండాలి. అలాకాకుండా జనాభా లెక్కల మేరకు సీట్లు పెంచినా.. 50 శాతం పెంచినా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుంది. ఇప్పుడు 543 లోక్‌సభ సీట్లున్నాయి. ఇందులో 50 శాతం అంటే 272 సీట్లు పెరిగితే.. మొత్తం 815 అవుతాయి. ఇందులో 33శాతం మహిళా రిజర్వేషన్ సీట్లను కేటాయించాలని కేంద్రం యోచిస్తోంది. 50 శాతం ప్రకారమే లోక్‌సభ సీట్లు పెరిగితే.. దక్షిణాది రాష్ట్రాల ఎంపీ సీట్లతో సంబంధం లేకుండానే.. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరుగుతుంది. అదే పరిస్థితి ఎదురైతే.. దక్షిణాది రాష్ట్రాలను పట్టించుకునేవారే ఉండరు. నియంతృత్వం ఏర్పడుతుంది. అందుకే ఇప్పుడు దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల సీట్లకు ఎంత గ్యాప్ ఉందో.. అదే నిష్పత్తిలో పెంచాలి. దీనిపై ప్రజల్లో చర్చ జరగాలి. పార్టీలకు అతీతంగా పోరాడాలి. దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధి కొలమానాల ఆధారంగా సీట్లను పెంచాలి. దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయంపై ఏపీ కలిసిరాకపోతే.. ఆ రాష్ట్ర ప్రజలు ఆలోచిస్తారు. మాది జాతీయ పార్టీ అయినా.. అన్యాయంపై గళమెత్తేందుకు మా పార్టీ స్వేచ్ఛ ఇచ్చింది. తెలంగాణ నుంచి వసూలు చేస్తున్న ప్రత్యేక సెస్ నుంచి రూపాయి కూడా రాష్ట్రానికి తిరిగి ఇవ్వడం లేదు"

# మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సోమవారం రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాని కలిశారు. లోక్‌భవన్‌లో గవర్నర్‌తో దాదాపు గంటకు పైగా సమావేశ మైన బీఆర్ఎస్ సభా పక్షం నేతలు మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్, అరాచకంగా భూకబ్జాలకు పాల్పడుతున్నారని గవర్నర్‌కు తెలిపారు. ఒకప్పుడు 'ఇందిరమ్మ రాజ్యం' అని చెప్పి అధికారంలోకి వచ్చి న కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో అచ్చంగా ఆనాటి ఎమర్జెన్సీ రోజులను తీసుకువచ్చిందన్నారు. ఎమర్జెన్సీ సమయంలో తన కూడా 19 నెలల పాటు జైలు అనుభవించారని ఈ సందర్భంగా గవర్నర్ గుర్తుచేశారు. దురదృష్టవశాత్తు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ ప్రజలు ఎమర్జెన్సీ నాటి అరాచక పరిస్థితులు ఎదుర్కొంటున్నారని పార్టీ నేత లు తెలిపారు. పొంగులేటికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' అనే కంపెనీ మైనింగ్ నిబంధనలను ఉల్లంఘిం చి, జంట జలాశయాల పరిధిలో మైనింగ్ నిషేధం ఉన్నప్పటికీ అక్రమంగా మైనింగ్ చేస్తున్నారన్నారు. తెలంగాణ పెట్రోల్ డీలర్స్ సంబంధం లేని భూమిని చెరబట్టి ఎలాంటి మినరల్ డీలర్ లైసెన్స్, పొల్యూషన్ బోర్డ్ అనుమతులు, విద్యుత్ కనెక్షన్లు, పరిశ్రమల శాఖ అనుమతులు లేకుండానే రెండు సంవత్సరాలుగా నిరాటంకంగా వందల కోట్ల ప్రజా సంపదను, రెవెన్యూ మంత్రి కుటుంబం కొల్లగొడుతుందని అన్ని ఆధారాలతో సహా గవర్నర్‌కు ఒక విజ్ఞాపనపత్రాన్ని అందజేశారు. సీఎం, రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి ఈ అంశంలో చర్యలు తీసుకోవాలని శాసనసభలో లేవనెత్తితే మొ త్తం ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను సభ నుంచి బహిష్కరించారన్నారు. అదే అసెంబ్లీ సమావేశాల్లోనే.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ తప్పు చేసిందని, దానికి సంబంధించి మా ప్రభుత్వమే కొన్ని నోటీసులు కూడా ఇచ్చిందని ముఖ్యమంత్రి అసలు నిజాన్ని ఒప్పుకున్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. మంత్రి పొం గులేటిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశామని కేటీఆర్, హరీష్‌రావు, పార్టీ నేతలు గవ ర్నర్‌కు తెలియజేశారు.

### న్యాయం జరుగుతుందనే నమ్మకం లేదు..

కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఒకవైపు శాసనసభా సంఘాన్ని ఏర్పాటుచేస్తే అన్ని వాస్తవాలు బయటకు వస్తాయని, మంత్రి పొంగులేటి వందల కోట్ల రూపాయల అక్రమ మైనింగ్‌తోపాటు అక్రమ భూకబ్జాలు బయటకు వస్తాయని తెలిపారు. ఓ పక్క పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ జా యింట్ పార్లమెంటరీ కమిటీలు కావాలని పట్టుబడతారు, ఇక్కడ మాత్రం సభానాయకులు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాత్రం సభాసంఘాలకు విలువలేదు అన్నట్లు తన సొంత ప్రభుత్వ ఏజెన్సీలతోనే విచారణ జేపిస్తామంటున్నారని ఎద్దేవా చేశారు.. ముఖ్య మంత్రే స్వయంగా హోంశాఖ మంత్రి బాధ్యతలు తీసుకున్నప్పుడు సీబీసీఐడీతోగాని, రాష్ట్ర హోమ్ శాఖ అధికారులతోగాని న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదన్నారు. అందుకే ఒక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో సభాసంఘాన్ని ఏర్పాటు చేయాలని లేదా ఇండిపెం డెంట్ జుడీషియల్ ఇంక్వైరీ కావాలని గవర్నర్‌కు చెప్పామన్నారు. మంత్రిగా ఉన్న పొం గులేటి తన ప్రభుత్వమే చేపట్టే విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. గవర్నర్ జోక్యం చేసుకొని న్యాయం చేయాలన్నారు. దీంతోపాటు ప్రభుత్వం మొత్తం గవర్నర్ పేరుతోనే నడుస్తుంది కాబట్టి ఆయన జోక్యం చేసుకొని ఒక స్వతంత్ర విచారణ లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థలతో విచారణకు ఆదేశించే విధంగా చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు.

### ఆర్టీఐ ద్వారా అడ్డగోలుగా..

ఈ మొత్తం అంశాలను విని, ఇచ్చిన సాక్ష్యాధారాలను చూసిన తర్వాత ఈ అం శంలో సానుకూలంగా స్పందిస్తానని గవర్నర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఈ మొత్తం అంశంలో భారతీయ జనతా పార్టీ కూడా మౌనంగా ఉన్నదని, ఇప్పటిదాకా ప్రభుత్వంపైన ఎలాంటి ఒత్తిడి తీసు కురాలేదని కేటీఆర్ ఆరోపించారు. గవర్నర్‌కు మేము ఇచ్చిన విజ్ఞప్తి తర్వాత ముం దుకు రాకుంటే కచ్చితంగా ప్రజాక్షేత్రంలో ఎండగడతామని, బాధితులకు న్యాయం జరిగేదాకా, అక్రమ మైనింగ్ ఆగేవరకు పోరాటం చేస్తామన్నారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిలింగ్ కోసమే పొంగులేటి అక్రమాలను బయటకు తీసుకువచ్చిందని చేసిన కామెంట్లకు స్పందిస్తూ, రేవంత్ రెడ్డి కంటే పెద్ద బ్లాక్ మెయిలర్ రాష్ట్రంలో ఎవరూ ఉండరని, ఒకప్పుడు ఆర్టీఐని అడ్డుగా పెట్టుకొని అడ్డగో లుగా సంపాదించిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎవరు అడిగినా విచారణకు ఆదేశిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి మాటమార్చి పొంగులేటి పైన విచా రణ చేయడానికి వెనక్కిపోయారని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంక్వై రీ చేస్తే అమృత్ కుంభకోణం, ఫోన్ ట్యాపింగ్ కుంభకోణం, సింగరేణి కుంభకోణం, హైదరాబాద్ పారిశ్రామిక భూ ముల హిల్ట్ పీ పాలసీ కుంభకోణం.. ఇలా దాదాపు 14 అంశాలపైన ఆధారాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, ఎంక్వైరీ చే యాలని సీఎంకు సవాల్ విసిరారు. రేవం త్ కుటుంబమైనా, శ్రీనివాస్‌రెడ్డి కుటుంబమైనా చర్య లు తీసుకుంటానని చెప్పిన రేవంత్, ఆధారాలతో సహా పొంగులేటి కుంభకోణాన్ని బయటపెడితే మౌనంగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డికి దమ్ముంటే చర్యలు తీసుకొని తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సవాలు చేశారు.

# కరడుగట్టిన నక్సలిజం ఖతం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

### ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్.. భీకర పోరు

'తెలంగాణ--ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని దట్టమైన అటవీ ప్రాంతంలో 50 కి.మీ. పొడవు, 37 కి.మీ. వెడల్పు ఉన్న ఒక కొండపై మావోయిస్టులు ఏళ్ల తరబడి శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అక్క డ సోలార్ విద్యుత్, ఐఈడీ (బాంబుల) తయారీ ఫ్యాక్టరీలు, ఐదేళ్లకు సరిపడా ఆహార ధాన్యాలు నిల్వ ఉంచుకున్నారు. 400 నుంచి 500 మంది కేడర్ అక్కడ ఉన్నారు. ఆ స్థావరాన్ని ఛేదించేందుకు కోబ్రా, సీఆర్పీఎఫ్, డీఆర్‌జీ, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సంయుక్తంగా 21 రోజులపాటు ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ చేపట్టారు. 45 డిగ్రీల భగభగమండే ఎండలో మన జవాన్లు రోజుకు కేవలం 300 మిల్లీలీటర్ల నీటిని తాగుతూ ధైర్యంగా పోరాడారు. ఈ ఆపరేషన్‌లో 30 మందికిపైగా మావోయిస్టులు హతమయ్యారు. మిగిలిన వారు లొంగిపోయారు లేదా పారిపోతూ పోలీసులకు చిక్కారు. దీంతో బస్తర్, మహారాష్ట్ర, తెలంగాణలో మావోయిస్టుల ఉనికి తుడిచిపెట్టుకుపోయింది. అయితే, ఈ ఆపరేషన్ సమయంలో నక్సల్స్ పైకి (ఉత్తరం వైపు) రాకుండా అడ్డుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరగా వారు నిరాకరించారు. కిందికి వస్తే మాత్రం ఆపుతామని చెప్పారు' అని అమిత్ షా పేర్కొన్నారు.

### తెలంగాణలో తుడిచిపెట్టుకుపోయారు

024 ప్రారంభంలో మావోయిస్టు కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో 21 మంది సభ్యులు ఉండగా.. ఇప్పుడు వారు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయారని అమిత్‌షా తెలిపారు. 'ఒకరు పట్టుబడ్డారు, ఏడుగురు లొంగిపోయారు, 12 మంది హతమయ్యారు, ఒకరు మాత్రమే పరారీలో ఉండి చర్చలకు మొగ్గుచూపుతున్నారు. అలాగే దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలోని 37 మందికిగాను ఎవరూ మిగల్లేదు. తెలంగాణ విషయానికి వస్తే, రాష్ట్ర కమిటీలో ఉన్న వారిలో ఆరుగురు లొంగిపోయారు, ముగ్గురు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. ప్రస్తుతం తెలంగాణలో ఒక్క నక్సలైట్ కూడా లేదు' అని చెప్పారు. బసవరాజు, హిడ్మా, వివేక్, పల్లూరి ప్రసాదరావు (చందన), వాసుదేవ్ వంటి అగ్రనేతలు ఎన్‌కౌంటర్లలో చనిపోవడం లేదా లొంగిపోయారని తెలిపారు.

### కాంగ్రెస్ దన్నుతోనే నక్సలిజం

'1970లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ 'అంతరాత్మ ప్రబోధానుసారం ఓటు వేయండి' అని పిలుపునిచ్చి, నీలం సంజీవరెడ్డికి వ్యతిరేకంగా మావోయిస్టుల మద్దతు తీసుకున్నారు. ఆ మద్దతును ఆసరాగా చేసుకుని మావోయిస్టులు దేశంలోని 17 శాతం భూభాగానికి, 10 శాతం జనాభాకు విస్తరించారు. తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేసుకున్నారు' అని అమిత్‌షా చెప్పారు. అలాగే నక్సల్స్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేత మహేంద్ర కర్మ ప్రారంభించిన 'సల్వాజుడుం' ఉద్యమాన్ని 2011 జూలై 5న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం చట్టవిరుద్ధమని ప్రకటించిందని, ఆ తీర్పు వల్లే నిరాయుధులైన ఎంతోమంది సల్వాజుడుం కార్యకర్తలను, ఆదివాసీలను నక్సల్స్ ఊచకోత కోశారని చెప్పారు. ఆ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తినే విపక్షాలు ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టాయని, ఇదీ కాంగ్రెస్‌కు నక్సల్స్‌తో ఉన్న లాలూచీ అని దుయ్యబట్టారు. 'రాహుల్ గాంధీ రాజకీయ జీవితంలో అనేకసార్లు నక్సల్స్ సానుభూతిపరులతో కనిపించారు. ఆయన జరిపిన భారత్ జోడో యాత్రలో నక్సల్స్ ఫ్రంటల్ ఆర్గనైజేషన్లకు చెందిన వారు పాల్గొన్నారు. 2010లో ఒడిశాలో లాడో సికాకాతో, 2018లో హైదరాబాద్‌లో గద్దర్‌తో రాహుల్ వేదిక పంచుకున్నారు' అని అమిత్‌షా పేర్కొన్నారు. 1970 నుంచి 2026 మార్చి వరకు వామపక్ష తీవ్రవాదానికి కాంగ్రెస్ మద్దతు ఇస్తూనే ఉందని, నక్సల్స్ చేతిలో ప్రాణాలు కోల్పోయిన 20 వేల మంది పౌరులు, జవాన్ల మరణాలకు కాంగ్రెస్ బాధ్యత వహించాలన్నారు.

# జనగణన.. రేపటి నుంచి..

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం ఇక్కడ జాతీయ మీడియా సెంటర్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. దేశ చరిత్రలో 1872లో మొదలైన తొలి జనగణనతో కలుపుకొంటే ఇప్పుడు చేపట్టబోయేది 16వది, స్వతంత్ర భారతదేశంలో 8వది. తొలిసారి డిజిటల్ రూపంలో వివరాలు సేకరిస్తున్నారు. జనగణనలో భాగంగా సేకరించే వ్యక్తిగత డేటాను గోప్యంగా ఉంచుతారు. ఏ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థతోనూ కేంద్రం పంచుకోదు. కాబట్టి వాటి ఆధారంగా విచారణలు, దర్యాప్తులు చేపట్టడానికి అనుమతి ఉండదు. ఈ వివరాలను సమాచారహక్కు చట్టం (ఆర్టీఐ) కింద కూడా ఇవ్వరు. న్యాయస్థానాల్లో సాక్ష్యాలుగా వినియోగించడానికి వీల్లేదు.

### 33 ప్రశ్నలతో సమాచార సేకరణ

తొలిదశలో గృహగణన కార్యక్రమం ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో స్థానికంగా ప్రకటించిన తేదీల వారీగా నెలరోజులపాటు జరుగుతుంది. ఇందులో 33 ప్రశ్నల ఆధారంగా ప్రజల ఇళ్ల స్థితిగతులు, ఇంట్లోనివారి పరిస్థితులు, వారికి అందుబాటులో ఉన్న సౌకర్యాలు, చరాస్తుల వివరాలు అడిగి నమోదు చేస్తారు. పౌరులు చెప్పిన వివరాలను ఎన్యూమరేటర్లు యథాతథంగా నమోదు చేసుకుంటారు. గృహగణన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లో మే 1 నుంచి 30 వరకు, తెలంగాణలో అదే నెల 11 నుంచి జూన్ 9 వరకు జరుగుతుంది. దీనికి 15 రోజుల ముందు నుంచి సెల్ఫ్ ఎన్యూమరేటర్ పోర్టల్‌లో ప్రజలు తమ గృహసంబంధ వివరాలను స్వయంగా నమోదు చేయొచ్చు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని సీడాక్ అభివృద్ధి చేసిన మొబైల్ యాప్ ద్వారా మొత్తం 16 భారతీయ భాషల్లో వివరాల నమోదు కార్యక్రమం జరుగుతుంది.

ప్రస్తుత తొలిదశలో గృహసంబంధ వివరాలు రాబట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 33 ప్రశ్నల ఆధారంగా ప్రజలు సొంతంగానే తమ వివరాలను వెబ్‌సైట్‌లో లేదా మొబైల్‌యాప్‌లో నమోదు చేయొచ్చు. ఇంటి పెద్ద పేరు, మొబైల్ నంబరు, ఈమెయిల్ నమోదు చేసిన వెంటనే ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేసిన తర్వాత ప్రశ్నావళితో కూడిన పోర్టల్ తెరుచుకుంటుంది. అక్కడ వివరాలన్నీ నమోదుచేసి సమర్పించిన తర్వాత 'హెచ్' అనే ఇంగ్లిష్ అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల ఐడీ కనిపిస్తుంది. అది ఎస్ఎంఎస్ ద్వారానూ వస్తుంది. ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ఆ ఐడీని వారికివ్వాలి. స్వయంగా నమోదుచేసిన వివరాలన్నీ సరిగా ఉంటే సరే. మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే ఆ సమయంలో సరి చేసుకోవచ్చు. తొలి దశలో కులగణన ఉండదు. వ్యక్తిగత జనాభా వివరాలు సేకరించే రెండోదశలో మాత్రమే కులం, మతం వివరాలు సేకరిస్తారు. ఈ వివరాల ఆధారంగా ప్రభుత్వ పథకాలు ఇవ్వడం, తొలగించడం జరగదు. డేటా భద్రతకోసం హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌పరంగా అన్ని రకాల చర్యలూ తీసుకున్నారు.

# ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇల్లు కట్టిస్తాం: డీసీసీ అధ్యక్షులు

**ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ప్రజాతీర్పు)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో పర్యటించిన డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ అనంతరం రాజన్నపేట, బొప్పాపుర్,పదిర గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే పేద బడుగు బలహీనవర్గాల పార్టీ అని,ఏదైతే చెప్తామో అదే చేస్తామని చెప్పింది చేయడమే కాంగ్రెస్ పార్టీ నైజం అని అన్నారు.పదిమంది నిరుపేదలు ఆసుపత్రిపాలై అప్పుల పాలై తమ దీనస్థితిని దరఖాస్తు రూపంలో ప్రభుత్వానికి మొర పెట్టుకుంటే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నేరుగా లబ్ధిదారుని ఖాతాలోకి ఆసుపత్రి ఖర్చులను పంపించడం జరుగుతుందని ఆపన్నులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని అన్నారు.సుమారు పదిమంది లబ్ధిదారులకు353,500 రూపాయల విలువ గల చెక్కుల పంపిణీ చేయడం జరిగిందన్నారు. గృహప్రవేశాలలో పాల్గొంటూ మండలంలో నిరుపేదలు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన పథకంతో సొంత జాగాలో ఇల్లు కట్టుకుంటూ ఐదు లక్షలు లబ్ధి పొంది ఇల్లు కట్టుకొని పండగ వాతావరణం లో గృహప్రవేశాలు చేసుకుంటూ అట్టి కార్యక్రమాలకు లబ్ధిదారులు మమ్మల్ని ఆహ్వానించడమే మా పాలనకు నిదర్శనం అన్నారు.కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులు హామీల అమలును చూసి అసెంబ్లీలో ప్రతిపక్షం అధికార పక్షాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు.రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను గుర్తు చేస్తూ దరఖాస్తు పెట్టుకొని అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు.రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా ప్రతి కుటుంబ సభ్యుడికి 6



కిలోల చొప్పున సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,వడ్డీ లేని రుణాలు,200 యూనిట్ల వరకు గృహ విద్యుత్తు వినియోగ దారులకు ఉచిత కరెంటు,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దే అన్నారు.ప్రతి పేదవాడికి ఉపయోగపడే పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వంపై ఎంత భారం ఉన్నా సంక్షేమంలో రాజీ పడడం లేదు అన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడంలో భాగంగా రానున్న రోజుల్లో నూతన పెన్షన్ అమలు, దశల వారీగా పెన్షన్ పెంపు అంశాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు.ఇవన్నీ గమనిస్తున్న ప్రజలు లబ్ధి పొందుతున్న ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడుతుంటే ప్రతిపక్షాలు నివ్వెర పోతున్నాయని,భవిష్యత్తులో ఇచ్చిన హామీలు అమలు చేయడంతో పాటు పేద ప్రజలకు చేయాల్సినవి హామీలు ఇవ్వకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సాభేరా బేగం,ఎంపీడీఓ సత్తయ్య, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ సాహెబ్,కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్ రెడ్డి,సీనియర్ నాయకులు చేపూరి రాజేశం, బండారి బాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మెండే శ్రీనివాస్,మర్రి నారాయణరెడ్డి,యువ నాయకులు గుర్రాల రాజిరెడ్డి,గుడ్ల శ్రీనివాస్,దుంపేటి జనార్దన్, పందిళ్ళ నారాయణ గౌడ్, పందిళ్ళ సుధాకర్ గౌడ్,ఆయా గ్రామాల నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.





## ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**(గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మార్చి 30**

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపుకలెక్టర్ ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు. లిఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 74 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్.లత,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, జగిత్యాల, కోరుట్ల,మెట్ పెల్లి ఆర్డీవోలు మధు సూదన్, జీవాకర్రెడ్డి, నరసిం హారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు మరియు పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

టౌన్ సి. ఐ. కరుణాకర్...

**(గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) మార్చి 30**



ట్రాఫిక్ పోలీసులు జగిత్యాల లో సోమవారం సాయంత్రం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 50 మంది మైనర్లు వాహనాలు నడుపుతుంటే పట్టుకున్నారు. పట్టుకున్న మైనర్లను జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ నిర్వహించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన పోలీసులు మరోసారి నడిపితే కేసులు నమోదు చేస్తామని టౌన్ సి ఐ కరుణాకర్ తెలిపారు.



## సాయి సిద్దార్థ హైస్కూల్‌లో యూకేజీ, ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**(వినోద్, ప్రజాతీర్పు మేడ్చల్ ప్రతినిధి) మార్చి 30**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడలో ఉన్న సాయి సిద్దార్థ హైస్కూల్‌లో స్కూల్ డైరెక్టర్ సత్య కల్లూరి ఆధ్వర్యంలో యూకేజీ మరియు 5వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత పత్రాలు (పాస్ సర్టిఫికెట్లు), ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ప్రకటన విడుదల చేసింది. ఈ వేడుకలో చిన్నారులు తమ చదువులో ఒక ముఖ్యమైన దశ పూర్తి చేసి, తర్వాతి చదువుల దిశగా అడుగు వేస్తున్న సందర్భంలో ఆనందకరమైన, భావోద్వేగభరితమైన వాతావరణం నెలకొంది. పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్న చిన్న ప్రసంగాలు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఉత్తీర్ణత పత్రాలు (పాస్ సర్టిఫికెట్లు), గుర్తింపు పత్రాలు అందజేశారు. యూకేజీ పూర్తి చేసిన చిన్నారులకు ప్రాథమిక విద్యలోకి ప్రవేశం సూచించే సర్టిఫికెట్లు, 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు పై తరగతులకు వెళ్లే అర్హతను తెలియజేసే ఉత్తీర్ణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థిని పేరు పిలిచి వేదికపైకి ఆహ్వానించి, గౌరవంగా సర్టిఫికెట్ ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, గురువులు మరియు ఆహ్వానిత అతిథులు పాల్గొని పిల్లలను అభినందించారు. పిల్లలు ఇలా స్టేజ్ మీద సర్టిఫికెట్లు తీసుకోవడం వాళ్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, చదువుపై మరింత ఆసక్తి వస్తుందని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఇలాంటి కార్యక్రమాలు పిల్లలకు మంచి ప్రోత్సాహం ఇస్తాయని, చదువు విలువలను సమాజానికి చేరవేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ పాఠశాల యాజమాన్యం పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## రాముల వారి ఉత్సవంలో భాగంగా ప్రైమరీ స్కూల్ పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు

**పెగడపల్లి, మార్చ్ 30 (ప్రజాతీర్పు)**



పెగడపల్లి మండలం నంచర్ల గ్రామంలోని అపర భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఉత్సవంలో భాగంగా నంచర్ల గ్రామంలోని ప్రైమరీ స్కూల్ పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమనికి సహకరించిన పిల్లలను మరియు ఉపాధ్యాయులను ఆలయ కమిటీ వారు సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంటాల వనజ శ్రీనివాస్ మరియు ఉప సర్పంచ్ ఎడ్ల శ్యాంసుందర్ రెడ్డి మరియు ఆలయ కమిటీ చైర్మన్ బండి వెంకన్న మంత్రి హరిగోపాల్ కడారి జనార్ధన్ లైసెట్టి దామోదర్ మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనడం జరిగింది

## కౌశిక్ రెడ్డి నివాసంపై కోడిగుడ్లు, టమాటాలతో దాడి

### భగ్గుమన్న హుజురాబాద్ యువజన కాంగ్రెస్

**జమ్మికుంట మార్చి 30 ప్రజాతీర్పు**



మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజరాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి నివాసంపై యువజన కాంగ్రెస్ శ్రేణులు విరుచుకుపడ్డాయి. హుజరాబాద్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పంజాల అరవింద్ గౌడ్ నాయకత్వంలో కార్యకర్తలు కౌశిక్ రెడ్డి నివాసంపై కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేసి, ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ?అనంతరం యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు చల్లూరి రాహుల్, మండల అధ్యక్షులు పంజాల అరవింద్ గౌడ్ మాట్లాడుతూ.. శాసనసభ వేదికగా దళిత నేత కడియం శ్రీహరిపై చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకొని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో హుజరాబాద్ నియోజకవర్గంలో కౌశిక్ రెడ్డిని తిరగనివ్వబోమని హెచ్చరించారు. కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేసే వరకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. ?ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు టేకుల శ్రవణ్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు బండ నవీన్, ప్రధాన కార్యదర్శి శనిగరపు తరుణ్, చిట్యాల రేవంత్, మండల ఉపాధ్యక్షులు మేకల రాజ్ కుమార్, చల్లూరి విష్ణు వర్ధన్, ప్రధాన కార్యదర్శి పంజాల రాజు గౌడ్, నాయకులు ఎండీ సాధిక్, జన్ను ప్రసాద్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



## రాజన్న కోడెల మృత్యువాత.. ఆవేదనలో భక్తులు

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) మార్చి 30 :**

కోడె మొక్కుల రూపంలో రాజన్న ఆలయానికి సింహ భాగం ఆదాయం వస్తున్నా కూడా రాజన్న కోడెలు మృతి చెందుతున్నాయి . గతంలో కోడెల మృతుల నేపథ్యంలో గోశాలలో అదనపు సిబ్బందిని నియమిస్తూ.. సౌకర్యాలు మెరుగుపరిచామని అధికారులు తెలిపారు. అయినప్పటికీ మళ్లీ రాజన్న స్వామివారికి ఇష్టమైన నాలుగు (4) కోడెలు సోమవారం మరణిం చడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



## ఏకాంత సేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

**ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ప్రజాతీర్పు)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం తో ముగిశాయి. ఈనెల 25న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం ఏకాంత సేవతో పూర్తయినట్లు అర్చకులు శ్రీనివాస్ ఆచారి వేణుగోపాల్ చారి ప్రకటించారు.స్వామి వారి ఊరేగింపు పెద్ద రథం పైన శ్రీ సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పెద్ద రథం యాత్ర కొనసాగింది.మధ్యాహ్నం మూడు గంటలకు వ్రత పుణ్యా వచనం హోమం వ్రతబలి జరిగింది అనంతరం మహా పూర్ణాహుతి చక్రస్నానం నాగవల్లి పుష్పయాగం దేవతా ఉద్వాసన గ్రామ బలి హనుమాన్ దేవాలయం వరకు వెళ్లి గ్రామ బలిని పూర్తి చేశారు.అనంతరం సప్తావరణ పూజ ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయని ఆలయ కమిటీ చైర్మన్ మోతె లక్ష్మారెడ్డి,సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య అన్నారు. భారీ ఎత్తున మహిళలు మంగళహారతులతో స్వామికి స్వాగతం పలికి, ఆలయం వరకు భజనలు సంకీర్తనలతో వచ్చారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు రథోత్సవంలో పాల్గొని భజనలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని పొన్నాల రాములు చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎస్కే సబేరా బేగం, డిప్యూటీ తహసిల్దార్ ఎలుసాని ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి ,నాయకులు లద్దునూరి హనుమాన్లు, షేక్ గౌస్, సిరిపురం మహేందర్, నిమ్మ సుధాకర్ రెడ్డి,లింగాల వెంకటరాజు, బలగం రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## అడువాల జ్యోతి జన్మదిన వేడుకలు

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మార్చి 30.**

జగిత్యాల పట్టణంలోని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు స్థానిక అరవింద్ నగర్ లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం వేద పండితుల ఆశీర్వాదం తీర్థప్రసాదాలు అందజేశారు ఆలయ కమిటీ. వారి వెంట మాజీ కౌన్సిలర్ వీరబత్తిని పద్మజ శ్రీనివాస్, కొత్త మోహన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

**(వి,వెంకటేష్, ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మార్చి 30**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం అంబేద్కర్ చౌరస్తా మార్కెట్ ఏరియాలో భవన నిర్మాణ కార్మికులకు నిరుపేదలకు కూలీలకు ఆటో డ్రైవర్లకు బాటసారులకు చిరు వ్యాపారస్తులకు 4వ రోజు దాత కీర్తిశేషులు హరి కిసాన్ సోనీ కుటుంబ సభ్యుల సాకారంతో అంబలి పంపిణీ చేయడం జరిగినది. దాతల సహకారంతో ప్రతిరోజు అంబలి పంపిణీ ఉంటుందని 400 మందికి పైగా ఉచితంగా అంబలి పంపిణీ చేయడం అయినది కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు గెల్లీ జయరాం యాదవ్ నాగుల లింగయ్య, గురు స్వామి, గరిగె రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

# కొండగట్టు శ్రీ చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

(గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) మార్చి 30

జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు ఏప్రిల్ 01.04.2026నుండి 03.04.2026. తేది వరకు జరగనున్న సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం రోజున కొండగట్టు ఆలయ పరిసరాల్లో నిర్వహించనున్న జయంతి ఉత్సవాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా సమీక్షించారు. లిఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని భావించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాలయం పరిసర ప్రాంతాల్లో 64 సీసీ కెమెరాలతో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్ప్ సెంటర్, ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలు 6 ప్రదేశాల్లో ఏర్పాటు, ప్రత్యేక స్థలాల్లో భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక టెంట్ ల ఏర్పాటు, మెట్ల దారి మార్గంలో లైటింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. దీక్ష విరమణ, ప్రసాదాల కౌంటర్ ల వద్ద క్యూ లైన్ల వద్ద బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా, పార్కింగ్ సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు తాగునీరు (చలి వేంద్రాలు), మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు



సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కొండ పైన వైద్య సిబ్బందిని నియమించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని, వడదెబ్బ నివారణకు గాను ఓ. ఆర్. ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతూ, 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించామని తెలిపారు. జయంతి ఉత్సవ రోజుల్లో నిరంతరంగా 24 గంటల విద్యుత్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కోనేరు యందు ఎప్పటికప్పుడు నీరు నింపుటకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు భక్తులు మరియు దీక్ష స్వాముల సౌకర్యార్థం వేములవాడ జగిత్యాల మరియు కరీంనగర్ నుండి ప్రత్యేకంగా బస్సుల నడుపనున్నట్లు తెలిపారు. దేవస్థానం పరిధిలో మరియు గుట్ట కింద గల వీధులలో పారిశుధ్య సిబ్బందిని అవసరం మేరకు కేటాయించి నిరంతరం శానిటేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఆయా విధులు కేటాయించిన అధికారులకు వసతులు కల్పించిన చోటే బస చేసి అప్పగించిన విధులను భాధ్యతగా నిర్వర్తించి జయంతి ఉత్సవాలు ఘనంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డిపివో మదన్ మోహన్, ఆలయ ఏవో అంజనా రెడ్డి, ఎమ్మార్వోలు , ఎంపిడివోలు, సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



## మెనూ కచ్చితంగా పాటించాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఈఎంఆర్ఎస్ విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ప్రజాతీర్పు)

విద్యార్థులకు మెనూ కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన భోజనం ఇవ్వాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) విద్యాలయంలో కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, స్టోర్ రూమ్ లో ఆహార సామగ్రి, కోడి గుడ్లు, కూరగాయలు, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలు, తరగతి, వసతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడి గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవు తుండగా, కలెక్టర్ వారితో మాట్లాడి.. పలు సూచనలు చేశారు. విద్యార్థులందరూ చదువు పై శ్రద్ధ పెట్టాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. తాము అనుకున్న ఉద్యోగాలు, ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.



## గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరం

సూరారం మార్చ్ 30 (ప్రజా తీర్పు)

ఈ రోజు సుభాష్ నగర్ 130వ డివిజన్ పాండు బస్తి కమ్యూనిటీ హాల్‌లో కమిటీ ఆధ్వర్యంలో, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి , డివిజన్ దీ=జా పార్టీ అధ్యక్షులు పోలె శ్రీకాంత్ , సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మి నారాయణ హాజరై శిబిరాన్ని సందర్శించారు. వారు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. ఈ హెల్త్ క్యాంప్‌లో పాండు బస్తి కమిటీ సభ్యులు మీన్ కుమార్, ప్రభాకర్ నాయుడు, శ్రీశైలం యాదవ్, సుధాకర్ ముదిరాజ్, విష్ణు, చంద్ర రెడ్డి, శంకర్, రఘు, సతీష్ తదితరులు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే బస్తి ప్రజలు భారీ సంఖ్యలో హాజరై ఉచిత వైద్య పరీక్షలు చేయించుకొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.



## ధర్మపురి మండలం రాయపట్నం రామాలయం చైర్మన గా గోపాతి చేరణ్ ఎన్నిక

(కుమారస్వామి, ప్రజాతీర్పు జగిత్యాల రూరల్) మార్చి 30

జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నం గ్రామస్తులంత ఐక్యమత్యంతో రామాలయం చెర్మన్ గా గోపతి చేరణ్, వైస్ చైర్మన్ గా గొర్ల శ్రీనివాస్ రామాలయం మెంబర్స్ గా గోపాతి చెంద్రయ్య, అన్నపురం మల్లేష్,గోడిసేలా అంజిత్, జోగినిపెల్లి వెంకటేష్, కొత్తపల్లి రాకేష్, బలే గురువయ్య, గోపాతి మల్లేశం, బలే మహేష్, కౌలే రాంబాబు,ఆలయ సలహా దారునిగా పలాజీ గ్యానాచారి ని ఎన్నుకోవడం జెరిగింది.ఈ కార్యక్రమం లో రాయపట్నం సర్పంచ్ రాందేని మొగిలి,ఉపసర్పంచ్ చిలుక రామన్న ,పాయల శెరత్,రామాలయం మాజీ చెర్మన్ ముక్కెర అరుణ్,గొల్ల రమేష్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## కోరపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని అవినీతితో బ్రష్టు పట్టిస్తున్న పింగిలి రాకేష్

జమ్మికుంట మార్చి 30 ప్రజాతీర్పు



జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పింగిలి రాకేష్ అరాచకాలు తెలంగాణ ఫిషరీస్ రాష్ట్ర కార్యదర్శి అంటూ దొంగ లెటర్ ప్యాడ్ చూపిస్తూ రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయంటూ రోజుకొక నాయకుల ఫోటోలు పెట్టుకుంటూ సామాన్య ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేస్తూ జీవనాధారంగా అవినీతి జీవితాన్ని అనుభవిస్తున్న పింగిలి రాకేష్ గతంలో కరీంనగర్ జిల్లాలో ప్రజావాణిలో ఇందిరమ్మ కమిటీలపై అక్రమంగా పైసలు వసూలు చేస్తున్నాడని ఫిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదుకు సంబంధించి జిల్లా అధికారులు రాష్ట్ర అధికారులు గ్రామపంచాయతీని సందర్శించగా ఇందిరమ్మ కమిటీ లో ఉన్న ఐదుగురు సభ్యులకు నలుగురు సభ్యులు హాజరుకాగా అవినీతిపరుడైన రాకేష్ పరారీ అయ్యాడు గ్రామంలోని ప్రజలు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి రాకేష్ ను పార్టీ నుండి బహిష్కరిస్తేనే పార్టీ బలోపేతం అవుతుందని పలుసార్లు సూచించడం జరిగింది.

## 2025-26 రబీ కాలానికి సంబంధించిన వరి ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా స్వీకరించాలి

సిద్దిపేట మర్చి 30 (ప్రజా తీర్పు)

సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జిల్లాలో 2025-26 రబీకారానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 421 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దాదాపు 5 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేయనున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి ఏరోజుకారోజు వరిధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు రవాణా చేయడం జరుగుతుందని అన్నారు. 48 బాయిల్డ్ రైస్ మిల్లులు, 64 ఇతర రైస్ మిల్లులు జిల్లాలోగలవని, ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా ప్రతిరోజు మిల్లులకు వచ్చే వరిధాన్యాన్ని రైస్ మిల్లర్లు దించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ గోపికృష్ణ, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## నక్సల్స్ విముక్త భారత్!.. దేశంలో నక్సలిజం దాదాపు తుడిచిపెట్టుకుపోయింది

దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని, మావోయిస్టు హింసాకాండకు నిలయమైన ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ నుంచి నక్సలిజాన్ని తుడిచిపెట్టామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ ప్రభుత్వం విధించిన మార్చి 31వ తేదీ గడువు సమీపిస్తున్న వేళ సోమవారం లోక్‌సభలో అమిత్ షా 90 నిమిషాలపాటు నక్సల్ విముక్త భారత్‌పై ప్రసంగించారు. బస్తర్ ఇప్పుడు అభివృద్ధి బాటలో పయనిస్తున్నదని, ఈ ఘనత భద్రతా దళాలు, రాష్ట్ర పోలీసులు, స్థానిక గిరిజన సమాజానికే దక్కుతుందని ఆయన తెలిపారు 'దేశంలో నక్సలిజం దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. ఈ ప్రక్రియ మొత్తం అధికారికంగా పూర్తయిన తర్వాత దేశానికి తెలియజేస్తాం. అయితే మన దేశం నక్సల్స్ రహితంగా మారిందని చెప్పగలను' అని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను తిరస్కరించి ఆయుధాలు పట్టుకునే వారిని ఉపేక్షించబోమని, అటువంటి వారు మూల్యం చెల్లించాల్సిందేనని ఆయన చెప్పారు.



## జమ్మికుంటలో పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం !

జమ్మికుంట మార్చి 30 (ప్రజాతీర్పు)

మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ జమ్మికుంటలో కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. ఆదివారం జమ్మికుంట పట్టణంలోని పాత అంబేద్కర్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంబాల రాజు ఆధ్వర్యంలో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అంబాల రాజు మాట్లాడుతూ.. తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా ఒక సీనియర్ దళిత నాయకుడిని తుపాకీతో కాల్చి చంపుతానని కౌశిక్ రెడ్డి అనడం ఆయన అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, వరంగల్ ఎంపీగా, ఉప ముఖ్యమంత్రిగా దశాబ్దాలుగా ప్రజా సేవలో ఉన్న కడియం శ్రీహరిపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమని ధ్వజమెత్తారు. తక్షణమే కౌశిక్ రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆయన కోరారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో హుజురాబాద్ నియోజకవర్గంలో కౌశిక్ రెడ్డిని తిరగనియ్యబోమని, దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మన్ ఎండి సలీం పాషా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెంచల శ్రీనివాస్, సిలివేరి రాజమౌళి, గొట్టే ప్రభుదాస్, ఆకినపల్లి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



# రచయిత టేకులపల్లి గోపాల్ రెడ్డి జీవితం స్ఫూర్తి దాయకం

సిద్దిపేట, మార్చి 30 (ప్రజాతీర్పు)

సిద్దిపేట డిగ్రీ కళాశాల రిటైర్డ్ లెక్చరర్, రచయిత టేకులపల్లి గోపాల్ రెడ్డి జీవితం నేటి తరానికి స్ఫూర్తి దాయకం అని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు అభిప్రాయ పడ్డారు. ఇటీవల మృతి చెందిన రచయిత, సామాజిక చింతనాపరుడు టేకులపల్లి గోపాల్ రెడ్డి స్మృతి సభ సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో సోమవారం మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగింది..సమావేశం లో టీ జె ఏ సి చైర్మన్, సిద్దిపేట డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ జి. పాపయ్య, ప్రముఖ రచయిత కె. అంజయ్య, టీపీటీఫ్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జి. తిరుతిరెడ్డి, మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు కె. రంగాచార్య, ప్రధాన కార్యదర్శి సిద్దెంకి యాదగిరి, మరసం పూర్వ అధ్యక్షులు తోట అశోక్, గజ్వేల్ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మహేందర్ రెడ్డి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు పొన్నాల బాలయ్య, ప్రధాన కార్యదర్శి గంభీర్రావు పేట యాదగిరి, తెలంగాణ వికాస సమితి అధ్యక్షులువ నందిని భగవాన్ రెడ్డి, వేణు, మహేందర్ తదితరులు పాల్గొని మాట్లాడారు..గోపాల్ రెడ్డి బాల్యంనుండి మొదలుకొని చివరి దశవరకు ఎన్నో సవాళ్ళను, ఒడిదుడుకులను ఎదుర్కొని నిలబడ్డ గొప్ప వ్యక్తి అని అభిప్రాయ పడ్డారు.. చిన్నతనంలో జరిగిన ఒక ప్రమాదం వల్ల సరైన వైద్యం అందక చూపు కోల్పోయిన గోపాల్ రెడ్డి బ్రెయిలీ లిపిలో పట్టుదలతో ఉన్నత విద్యను పూర్తి చేసి జూనియర్ కళాశాల లెక్చరర్ గా,డిగ్రీ కళాశాల లెక్చరర్ గా పనిచేసి ఎంతో మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దిన అధ్యాపకుడని తెలిపారు.. మాటతోనే మనిషిని గుర్తుపట్టే గొప్ప జ్ఞానం కలిగిన గోపాల్ రెడ్డి అని తెలిపారు.. ఆయన



సిద్దిపేట లో పనిచేసిన కాలం లో.. మెదక్ వెళ్లిన తరువాత కూడా మంజీరా రచయితల సంఘం తో సుమారు 40 సంవత్సరాలు కలిసి నడిచిన గొప్ప మానవతా వాది, సామాజిక చింతనా పరుడు గోపాల్ రెడ్డి అని అన్నారు. ఉద్యోగ విరమణ తరువాత మెదక్ సమీపంలో తన స్వగ్రామం లో స్థిరపడ్డ గోపాల్ రెడ్డి తన జీవిత చరిత్ర నే ప్రధాన అంశం గా " జీవన స్రవంతి " అనే గొప్ప నవలను రాశాడని అన్నారు. మూడు బాగాలుగా రాసిన ఆ నవల రెండు భాగాలు ఆవిష్కరణ అయ్యాయని మరో భాగం రచన పూర్తి అయ్యి ఆవిష్కరణ కు సిద్ధం అయ్యిందని అలాంటి తరుణంలో ఆయన మరణించడం బాధాకరమని అన్నారు.. ఆయన రాసిన " జీవన స్రవంతి " నవల సాహిత్య ప్రపంచం లో గొప్ప రచనగా నిలిచిపోయిందని.. ఆనవల కేవలం వ్యక్తిగత జీవిత చరిత్ర మాత్రమే కాదని ఒక 50 ఏండ్ల సామాజిక పరిణామాలను ఆనవలలో నిక్షిప్తం చేశాడని తెలిపారు.. ప్రపంచ సాహిత్యం లో అంధులు రాసిన సాహిత్యం చాలా తక్కువ అని అందులో గోపాల్రెడ్డి సార్ రాసిన నవల ఒకటని అభిప్రాయ పడ్డారు.. తన మనో నేత్రం తో సమాజాన్ని చదివి సాహిత్యం అందించిన గొప్ప ప్రేమ మూర్తి గోపాల్ రెడ్డి అని ఆయన మరణం సమాజానికి, సాహిత్యనికి తీరని లోటు అని మంజీరా రచయితల సంఘం అభిప్రాయ పడింది..

# గోపినగర్‌లో ఉత్సాహంగా జిల్లా స్థాయి కుస్తీ పోటీలు

## రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు 18 మంది ఎంపిక

**శేరిలింగంపల్లి, మార్చి 30 (ప్రజా తీర్పు)**



రంగారెడ్డి జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ నేతృత్వంలో జిల్లా స్థాయి అండర్ 20 పురుషులు, మహిళల కుస్తీ పోటీలు ఘనంగా జరిగాయి. తుల్జాభవాని వ్యాయామశాల ఆధ్వర్యంలో గోపినగర్ ప్రధాన కూడలిలో సోమవారం జరిగిన ఈ పోటీలలో జిల్లాలోని వివిధ వ్యాయామశాలల నుంచి దాదాపు 100 మంది క్రీడాకారులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఫ్రీ స్టైల్ వివిధ కేజీల విభాగంలో అభినయ్, శ్రీధర్, భరత్ బాబు, నాగేందర్, ఉమేష్, పియూష్ సింగ్, అభిషేక్, జయ కిషన్ యాదవ్, సోమనాథ్ రెడ్డి, మహిళలు అపూర్వ, లక్ష్మి, శ్రీనిధి, రోమన్ గ్రీక్ స్టైల్ విభాగంలో వివిధ కేజీల పోటీల్లో శివకుమార్, ప్రణవ్ కుమార్, సాంబా ధనుంజయ్, సందీప్ చరణ్, సంపత్ కుమార్, దీప్ సింగ్, రవి కిరణ్, అభిరామ్ రెడ్డిలు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరందరూ ఏప్రిల్ 2వ తేదీ కామారెడ్డి లో జరగనున్న స్థాయి రెజ్లింగ్ పోటీలకు అర్హత సాధించారు. విజేతలకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న పిసిసి ప్రధాన కార్యదర్శి శేరిలింగంపల్లి ఇన్చార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్, బిఆర్ఎస్ శేరిలింగంపల్లి ఉమ్మడి డివిజన్ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, మాజి కౌన్సిలర్ దొంతి లక్ష్మీనారాయణ గౌడ్, నాయకులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, మూల వెంకటేష్ గౌడ్, దుర్గం వీరేశం గౌడ్, విజయ్ కుమార్ రెడ్డి, కాటా నరసింహ గౌడ్, కొమరగౌని వెంకటేష్ గౌడ్, పుట్ట వినయ కుమార్ గౌడ్, బెజగం కేశవులు, లీలానంద్ గౌడ్, గోపాల్ యాదవ్, కలివేముల వీరేశం గౌడ్, పుట్ట శ్రీకాంత్ గౌడ్, గఫూర్, పవన్ గౌడ్, నర్సింహా తదితరులు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. కుస్తీ అంటే భారతీయ ప్రాచీన మల్ల యుద్ధమని, ఒలంపిక్స్ లోను ప్రాధాన్యతను సంతరించుకున్నదని అన్నారు. అలాంటి కుస్తీ వైపు యువత అడుగు లు వేయడం అభినందనీయమని అన్నారు. లింగంపల్లిలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించిన తుల్జా భవాని వ్యాయామశాల నిర్వాహకులు లచ్చుమొళ్ల పాండు గౌడ్, వారి కుమారులు అరవింద్ గౌడ్, మోహన్ గౌడ్, రోషన్ గౌడ్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కే.యాదయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.పాండు, ఉపాధ్యక్షులు హీరలాల్, కార్యదర్శి భగవాన్ సింగ్, కుస్తీ ప్రముఖులు రాజు, శ్రీధర్, రాజ్ కుమార్, సుధాకర్, రమ్య, శ్రీనివాస్, విశ్వంభర్ సింగ్, నవీన్, ప్రకాష్ సింగ్ బస్తీవాసులు సంఖ్యలో పాల్గొన్నారు.'



## సమాజాభివృద్ధిలో టీచర్ల పాత్ర ప్రముఖమైనది

**హుజురాబాద్ టౌన్, మార్చి 30 (ప్రజాతీర్పు)**

సమాజాభివృద్ధిలో టీచర్ల పాత్ర ప్రముఖమైనదని, విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి కోసం పాఠశాలల్లో ఉపాధ్యాయులు అహర్నిశలు కృషి చేస్తారని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. సోమవారం నాడు హుజురాబాద్ క్లబ్ ఆవరణలోని కన్వెన్షన్ లో చాడ భారతి ఉద్యోగ విరమణ సభ పెద్ద ఎత్తున జరిగింది. ఈ సభకు ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర జిల్లా నేతలు హాజరై ప్రసంగించారు. చాడ భారతి ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేసే ఎందరో విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దిందని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం సమాజ హితం కోసం ఉపాధ్యాయులు పనిచేస్తే సమాజంలో మంచి మార్పులు వస్తాయని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ సభకు చాలా భారతి భర్త ప్రముఖ వ్యాపారి పాశం మల్లారెడ్డి భారతి లను వారి స్నేహితులు కుటుంబ సభ్యులు అభిమానులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆదర్శన్ రెడ్డి, బండ రాజీరెడ్డి బి ఆర్ఎస్ నాయకులు కొండల్ రెడ్డి గందే శ్రీనివాస్ శంతన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ విక్రం రెడ్డి ఎంఈఓ విడపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడి కేంద్రంలో ఈసీసీఈ డే నిర్వహణ

**రామడుగు, మార్చి 30 (ప్రజాతీర్పు ప్రతినిధి):**



రామడుగు మండల కేంద్రంలోని అంగన్వాడి 4వ కేంద్రంలో ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రేణుక మాట్లాడుతూ చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రీ స్కూల్ విద్య ఎంతో అవసరమని తెలిపారు. ఆటలు, పాటలు, కథల ద్వారా పిల్లలకు విద్యాబోధన జరిగే విధానాన్ని తల్లులకు వివరించారు. మూడు నుండి ఐదు సంవత్సరాల వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని సూచించారు. ప్రీ స్కూల్ విద్య వల్ల పిల్లల్లో మానసిక, శారీరక, సామాజిక అభివృద్ధి మెరుగుపడుతుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు అంజలి, వసుమతి, లలిత, సంధ్య, అంగన్వాడి ఆయాలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.




## రంగదాముని పల్లె గ్రామంలో అరైవ్ ఆలైవ్ కార్యక్రమం నిర్వహణ

### గొల్లపెల్లి ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి

**(కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్) మార్చి 30**

జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం రంగధాముని పల్లె గ్రామంలో'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి,ముఖ్య అతిథులుగా హాజరై, ప్రజలకు రోడ్డు భద్రతకు సంబంధించిన నియమాలు, జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలైన అతి వేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగం వంటి అంశాలను వారు వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి., ట్రాఫిక్ సిగ్నల్ గౌరవించాలి అని స్పష్టం చేశారు. పాదచారుల భద్రతపై కూడా అధికారులు ప్రత్యేకంగా మాట్లాడారు, రోడ్డు దాటే సమయంలో ఇరు వైపులా చూసి దాటడం, పిల్లలు రోడ్డుపై ఆడకూడదనే జాగ్రత్తలు తీసుకోవాలని, గంజాయి మత్తు పానీయాలకు బానిసలుగా కాకూడదని సూచించారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వెహికల్స్ ఇవ్వకూడదని సూచించారు ప్రమాదం జరిగినప్పుడు వెంటనే 100 / 112 కు కాల్ చేయడం, బాధితుడికి ప్రాథమిక సహాయం అందించడం ఎంత ముఖ్యమో వివరించారు. చిన్న వయసు నుంచే ట్రాఫిక్ నియమాలు పాటిస్తే భవిష్యత్తులో ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని, "సురక్షితంగా వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో,, పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ వెంకన్న గౌడ్, వేణు, శ్రీనివాస్, లక్ష్మణ్, గ్రామస్తులు, యువకులు, తదితరులు, పాల్గొన్నారు.

## డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీకి దిశ నిర్దేశం

### జిల్లా కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట, మర్చి 30 (ప్రజా తీర్పు)**

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... జిల్లాలో యువతకి ఉద్యోగ ఉపాధి అందించడం కోసం పరిశ్రమలు స్థాపన ముఖ్యమైనదని అన్నారు. టీజీ – ఐ పాస్ లో ద్వారా వివిధ పరిశ్రమలు నెలకొల్పడానికి పెట్టుకున్న దరఖాస్తులను సంబందించిన శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆయా పరిశ్రమలు స్థాపించడానికి అవుసరమైన మౌలిక వసతులు శాఖల వారిగా క్షేత్రస్థాయిలో వెరిఫై చెయ్యాలని అన్నారు. గతంలో పరిశ్రమ స్థాపన కోసం దరఖాస్తు చేసుకొని ప్రస్తుతం పరిశ్రమల స్థాపనకు సుముఖంగా లేనియెడల అట్టి దరఖాస్తులను తొలగించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణేష్ రామ్, డిటిసిపిఓ, ఇరిగేషన్, మిషన్ భగీరథ, రవాణా, లీడ్ బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజా హరికృష్ణ దిష్టిబొమ్మను దహనం

- మండల అధ్యక్షుడు తప్పెట శంకర్ గ్రామ శాఖ అధ్యక్షుడు అనరాజు

**సిద్దిపేట మర్చి 30 (ప్రజా తీర్పు )**



నంగునూరు మండలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ల నియామకంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అన్యాయం జరిగిందని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా నంగునూరు మండల అధ్యక్షుడు తప్పెట శంకర్ గ్రామ శాఖ అధ్యక్షుడు అనరాజు నాగరాజు ఆధ్వర్యంలో సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజా హరికృష్ణ దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతతో పనిచేస్తూ, నాటి అధికార పార్టీ పెట్టిన కేసులకు భయపడకుండా పోరాటాలు చేసిన తమను పక్కనపెట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పార్టీ కోసం పనిచేయని నాయకుల ఇంట్లో మూడు పదవులు, ప్రభుత్వం రాగానే పార్టీ మారిన వారికి డైరెక్టర్ల పదవులు ఇచ్చి మండల నాయకుల సలహాలు సూచనలు లేకుండానే తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇలాగా ఆయన వ్యవహార శైలి కొనసాగితే రాబోయే రోజుల్లో మండల కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టి పోతుందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏ ఒక్క రోజైనా మండలంలోని కార్యకర్తను ఓదార్చిన రోజులు లేవన్నారు ఇలాంటి నాయకునికి పార్టీ టికెట్ ఇచ్చి అపహస్య పాలు చేస్తుందని అన్నారు అధిష్టానం ఎప్పటికైనా నియోజకవర్గ ఇంచార్జ్ తొలగించి పార్టీకి న్యాయం చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అచ్చిన సత్తయ్య గౌరబోయిన సంపత్, చలికాని యాదగిరి, సందబోయిన తిరుపతి యాదవ్, విక్రం రెడ్డి, జంగిటి శ్రీనివాస్ రాగుల కనకయ్య,రాగుల కృష్ణ దేవులపల్లి ప్రసాద్, పంగశేఖర్, దేవులపల్లి శంకరయ్య, ఆరేపల్లి సురేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## అన్నపూర్ణ కాలనీ కమ్యూనిటీ హాల్ భవనం (ఏ సి )ప్రారంభోత్సవం

- అధ్యక్షులు మార ప్రభాకర్ గుప్తా ఆధ్వర్యంలో ఒక కోటి 40 లక్షల రూపాయలతో భవన నిర్మాణం.
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న చామకూర మల్లారెడ్డి, ఈటల రాజేందర్.

**బోడుప్పల్, మార్చ్ 30 (ప్రజాతీర్పు)**

మేడ్చల్ జిల్లా,బోడుప్పల్ సర్కిల్ అన్నపూర్ణ కాలనీలో నూతనంగా నిర్మించిన ఏసీ కమ్యూనిటీ హాల్ భవనం ఘనంగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చామకూర మల్లారెడ్డి, ఈటల రాజేందర్ పాల్గొని రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమం సందర్భంగా కాలనీ అభివృద్ధికి ఇలాంటి సౌకర్యాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ వేడుకలో కాంగ్రెస్ పార్టీ డి సీ సీ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ అజయ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నాయకులు పార్టీలకు అతీతంగా భారీ సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక ప్రజలు కూడా పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సుమారు రూ. 1.40 కోట్ల వ్యయంతో ఈ కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మించారు. దాతల సహకారంతో నిర్మించబడిన ఈ భవనంలో ఏసీ సదుపాయం, విశాలమైన హాల్, ఇతర అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు ప్రభాకర్ గుప్తా మాట్లాడుతూ, ఈ కమ్యూనిటీ హాల్‌ను కాలనీ ప్రజలందరికీ అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. వివాహాలు, సమావేశాలు, సాంస్కృతిక మరియు సామాజిక కార్యక్రమాలకు ఈ హాల్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కాలనీ అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నామని, అందరి సహకారంతో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

## జమ్మికుంటలో ఆర్.పి.ల చేతివాటం

- మహిళా సంఘాల రుణాల్లో 'కమీషన్ల' దందా!

**జమ్మికుంట మార్చి 30 ప్రజాతీర్పు**




స్వయం సహాయక సంఘాల మహిళలకు అండగా ఉండాల్సిన అధికారులే వారిని నిలువు దోపిడీ చేస్తున్నారు. జమ్మికుంట పట్టణంలోని పలు వార్డుల్లో గ్రూపు రుణాల మంజూరు పేరుతో ఆర్.పి.లు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు బాధితులు వాపోతున్నారు.

**వసూళ్ల పర్వం ఇలా..**

బ్యాంకుల నుండి గ్రూపు సభ్యులకు రుణాలు ఇప్పించినందుకు గాను ఆర్.పి.లు ప్రతి లక్ష రూపాయలకు 1,000 రూపాయల చొప్పున కమీషన్ డిమాండ్ చేస్తున్నారు. 5 లక్షల రూపాయల రుణం వస్తే 5,000 రూపాయలు. 20 లక్షల రూపాయల రుణం వస్తే 20,000 రూపాయలు ఇవ్వాలని సభ్యులను వేధిస్తున్నారు. కేవలం పెద్ద రుణాలే కాకుండా, ముద్ర లోన్ల కింద వచ్చే 50,000 రూపాయలకు కూడా ఒక్కొక్కరి నుండి 1,500 రూపాయల వరకు వసూలు చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు రావడం లేదని సాకు..బ్యాంకుల నుండి వచ్చే ప్రతి పైసాలోనూ తమకు వాటా ఉండాలని, తమకు సరైన జీతాలు రావడం లేదని ఆర్.పి.లు బహిరంగంగానే చెబుతున్నట్లు తెలుస్తోంది. "డబ్బులు ఇవ్వకపోతే మీ పేర్లు తీసేస్తాం, వచ్చేసారి మీకు రుణాలు రాకుండా చేస్తాం" అంటూ మహిళలను బెదిరిస్తున్నట్లు సమాచారం."మేము కూలీ పనులు చేసుకుని కష్టపడి కంతులు కడుతున్నాము. కానీ, కమీషన్ల పేరుతో మా దగ్గర ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకోవడం అన్యాయం. వెయ్యి రూపాయలు తీసుకోవాల్సిన చోట 1500 వసూలు చేస్తున్నారు."ఓ బాధితురాలు అధికారులు స్పందించాలి తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియక, ఆర్.పి.లకు భయపడి చాలా మంది మహిళలు ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ కమీషన్ల దందాను అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ మహిళలు కోరుతున్నారు.

## ప్రతాపసింగారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద హృదయ విదారక ఘటన

### సరైన సమయంలో వైద్య సహాయం అందకపోవడంతో ఐదు సంవత్సరాల బాబు మృతి.

**మేడిపల్లి మార్చ్ 30 (ప్రజాతీర్పు)**



మేడ్చల్ జిల్లా మేడిపల్లి పరిధిలోని ప్రతాపసింగారంలో 2 బి హెచ్ కే ఇండ్ల వద్ద కన్నయ్య అనే బాబు( ఐదు సంవత్సరాలు )ప్రాణాలు కోల్పోవడం కాలనీవాసుల హృదయాలను కలచివేసింది. ఈ దుర్ఘటన స్థానిక ప్రజల్లో తీవ్ర ఆవేదన, ఆగ్రహాన్ని రగిలించింది. ఈ కాలనీలో సుమారు 2100 కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ, ప్రాథమిక సదుపాయాలు సైతం అందుబాటులో లేక ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తూ జీవిస్తున్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే ఆస్పత్రి లేకపోవడం వల్ల చిన్న చిన్న అనారోగ్యాలే ప్రాణాపాయ పరిస్థితులకు దారితీస్తున్నాయి. అంబులెన్స్ సదుపాయం సరిగ్గా లేకపోవడం, సమీప ఆస్పత్రులు దూరంగా ఉండటం వల్ల బాధితులు సమయానికి చికిత్స పొందలేకపోతున్నారు. స్థానికుల వేదన ఏమిటంటే -- ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులు చేసినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన నాయకులు ఇప్పుడు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని మండిపడుతున్నారు. ఈ విషాద ఘటనతో ఆగ్రహానికి గురైన కాలనీవాసులు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి బైఠాయించి ధర్నా నిర్వహించారు. "మాకు ఆస్పత్రి కావాలి", "మా ప్రాణాలకు విలువ లేదా?", "ఇంకెంతమంది చనిపోతే అధికారులు స్పందిస్తారు?" అంటూ నినాదాలు చేశారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు సైతం ఈ నిరసనలో పాల్గొని తమ గోడును వినిపించారు. ప్రజలు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను వెంటనే స్పందించి కాలనీలో శాశ్వత ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, కనీసం 24 గంటల వైద్య సదుపాయాలు, అంబులెన్స్ సేవలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటన అధికారుల నిర్లక్ష్యానికి ప్రతీకగా మారగా, ఇప్పుడు అయినా ప్రభుత్వం మేల్కొని ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలు తీసుకుంటుందా అనే ప్రశ్న ప్రతి ఒక్కరి మనసులో మిగిలిపోయింది.

# జనగణన కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలి: డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోలీకేరిలి

**మెదక్, మార్చి 30 ( ప్రజా తీర్పు ) :**

జనగణన-2027 మొదటి విడతలో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జనగణన సంచాలకులు భారతి హోలీకేరి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా జనగణన అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జనగణన, ఇండ్ల గణన, మ్యాప్ తయారీ, ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్ల నియామకంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇండ్ల గణన ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు అధికారులందరూ పూర్తి అవగాహనతో పని చేయాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గణన చేపట్టాలని సూచించారు. దేశంలో తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 11 నుండి జూన్ 9 వరకు ఇండ్ల గణన కార్యక్రమం కొనసాగుతుందని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. సన్నాహక చర్యలను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. యాప్ నిర్వహణలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా



వెంటనే పరిష్కరించాలని, గణన ప్రక్రియ నిరాటంకంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం చేపట్టాలని, ప్రతి 300 ఇళ్లకు లేదా 750--800 జనాభాకు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించాలని తెలిపారు. హౌస్ లిస్టింగ్ బ్లాకులను సిద్ధం చేసి క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, జిల్లాలో జనగణన-2027 మొదటి విడత ఇండ్ల గణన కార్యక్రమాన్ని సమన్వయంతో సక్రమంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్ , డీఎఫ్ఓ జో.జి జెడ్పి సీఈవో ఎల్లయ్య , , ముఖ్య ప్రణాళిక అధికారి సురేష్ బాబు మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో సమస్య పరిష్కారానికి ప్రజలు అందచేసిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు

**మెదక్, మార్చి 30 (ప్రజా తీర్పు ):**

సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు నుండి మొత్తం 81 దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పరిష్కార స్వభావం దరఖాస్తు దారునికి తెలియచేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు వచ్చే సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రాధాన్యతతో స్పందించాలని ఆయన సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి పర్యవేక్షణ లోపం ఉన్నా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈవో ఎల్లయ్య,డి. ఆర్.డి. ఓ శ్రీనివాసరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష మరియు లక్ష జరిమానా

- శిక్ష పడేందుకు కృషి చేసిన సిబ్బందిని అభినంధించిన
- ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్

**మెదక్, మార్చి 30 ( ప్రజా తీర్పు ):**

మెదక్: తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు సంవత్సరాల బాలికపై గణిత ఉపాధ్యాయుడు లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. ఈ ఘటనపై 2023 డిసెంబర్‌లో ఫిర్యాదు అందగా, అప్పటి తూప్రాన్ ఎస్ఐ శివానందం కేసు నమోదు చేశారు. అనంతరం విచారణాధికారిగా వ్యవహరించిన తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించగా, భరోసా లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ శ్వేత బాధిత బాలికకు మానసిక ధైర్యాన్ని మరియు విచారణ సమయంలో బాధితురాలికి, సాక్షులకు పూర్తి సహాయం అందించారు. అలాగే పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు వాదనలు, సాక్షుల పరీక్షలో సహకారం అందించారు. సమర్పించిన సాక్ష్యాలను పరిశీలించిన మెదక్ జిల్లా ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావళి, నిందితుడు కోకిల కోమల్ అనురూప అనలంకర్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధిస్తూ తీర్పు వెలువరీఛరాని జిల్లా ఎస్పీ తెలిపారు . జరిమానాగా విధించిన మొత్తాన్ని బాధిత బాలికకు పరిహారంగా అందజేయాలని కోర్టు ఆదేశించినట్లు తెలిపారు.ఈ కేసు దర్యాప్తులో తూప్రాన్ ఎస్ఐ గంగారాజు, జిల్లా లైజనింగ్ ఆఫీసర్ బి. విఠల్, పీసీలు జి. కృష్ణ,రవీందర్ గౌడ్, సీడీఓ నాగరాజు తదితరులు సమన్వయంతో పనిచేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇలాంటి కేసుల్లో వేగంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ డి. వి. శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఉద్యమకారుల ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం:కప్పాటి పాండురంగా రెడ్డి

**(వై యాదగిరి మహేశ్వరం ప్రజా తీర్పు రిపోర్టర్) మార్చి.30**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలో తెలంగాణ ఉద్యమ నాయకులను, ఉద్యమకారులను ముందస్తుగా హౌస్ అరెస్టులు చేయడం,గృహ నిర్బంధం విధించడం ప్రభుత్వ అప్రజాస్వామిక, అనైతిక చర్య అని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని ఆయన మండిపడ్డారు.సోమవారం అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో తెల్లవారుజామునే కందుకూరు పోలీసులు కప్పాటి పాండురంగా రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఉద్యమకారుల ఇళ్లకు వెళ్లి భయాందోళనలకు గురిచేస్తూ ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాపాలనకు విరుద్ధమని ప్రశ్నించారు."ఇదేనా మీ ప్రజా పాలన?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా,ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న వారిని అరెస్టు చేయడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలు,ఉద్యమకారుల పోరాటాలు కీలకమని గుర్తుచేసిన ఆయన, అదే ఉద్యమకారులను అరెస్టు చేయించడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం తన మొండివైఖరిని విడిచి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల మనోభావాలను దెబ్బతీస్తే భవిష్యత్తులో తగిన గుణపాఠం తప్పదని కప్పాటి పాండురంగా రెడ్డి హెచ్చరించారు.



## గంగాపూర్ చెరువు వద్ద ఘోర ప్రమాదం

### వెంటనే స్పందించిన ఎస్పీ -- క్షతగాత్రులకు సహాయం

**మెదక్, మార్చి 30 (ప్రజా తీర్పు):**

రామాయంపేట వెళ్లే మార్గంలో గంగాపూర్ చెరువు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డీసీఎం వాహనం, ఆటో ఢీకొనడంతో ఆటో పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. అప్పటికే ఆ మార్గంలో వస్తున్న జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించారు. తన వెంట ఉన్న క్యూ ఆర్ టీ (ఉ=ు) సిబ్బందిని సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సిబ్బంది అక్బర్, హరీష్, యాదగిరి చాకచక్యంగా వ్యవహరించి క్షతగాత్రులను బయటకు తీసారు. అక్కడ ఒక్క స్ట్రెచర్ మాత్రమే ఉండగా, కాలు విరిగిన మహిళను కానిస్టేబుల్ యాదగిరి స్వయంగా చేతులపై ఎత్తుకుని అంబులెన్స్‌లో ఎక్కించి ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని రోడ్డుపక్కకు జరిపి ట్రాఫిక్ అంతరాయం లేకుండా క్లియర్ చేశారు. త్వరగా స్పందించి సహాయక చర్యలు చేపట్టిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## డ్రైనేజ్ పనులు దగ్గరుండి చేయిస్తున్న అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బూర్గుల నవీన్ కుమార్

**(వైయాదగిరి మహేశ్వరం ప్రజా తీర్పు రిపోర్టర్) మార్చి. 30**



మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో 8వ వార్డు సభ్యులు రాణమ్మ యేసురత్నం కుమారుడు అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ... వార్డు అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్లడం జరుగుతుందని అన్నారు డ్రైనేజీ సమస్యలు దగ్గరుండి డ్రైనేజీలో తీయించడం జరిగింది డ్రైనేజీలు నిండిపోవడంతో దోమలు ఎక్కువై విష జ్వరాలు వచ్చి డెంగ్యూ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి అంటూ వార్డులో ఏ ఒక్కరికి సమస్య ఉందని తెలిసిన వెంటనే స్పందించి వస్తానని తెలియజేశారు ఎక్కడ ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని వార్డు సభ్యులకు తెలియజేశారు వెంటనే స్పందించి ప్రతి పని చేయిస్తున్నందుకు అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బూర్గుల నవీన్ కుమార్ కి వార్డు సభ్యులు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు



## విద్యార్థుల ప్రతిభకు వేదికగా బ్రిలియంట్ స్కూల్

### ఘనంగా 20వ వార్షికోత్సవ వేడుకలు

**రామడుగు, మార్చి 30 (ప్రజాతీర్పు ప్రతినిధి):**

రామడుగు మండల కేంద్రంలోని బ్రిలియంట్ మోడల్ స్కూల్ 20వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని వైశ్య భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులైన ఇటీవల ఎంపీఓగా ఉద్యోగం సాధించిన బందారపు ఆమని, ప్రస్తుత మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కటకం మనీష్, రామడుగు 12వ వార్డు సభ్యులు కారుపాకల నరేష్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ తోట కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ముఖ్యంగా నృత్య ప్రదర్శనలు హాజరైన వారందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభ, క్రమశిక్షణ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సహపాఠ్య కార్యక్రమాల్లోనూ రాణించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆధునిక విద్యా విధానంలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగగలరని తెలిపారు. పాఠశాలలు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించే కేంద్రాలుగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇలాంటి విద్యాసంస్థలు ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని పేర్కొంటూ, ప్రైవేట్ విద్యాసంస్థలు నాణ్యమైన విద్య అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని, తల్లిదండ్రులు పిల్లలకు సరైన మార్గదర్శకత్వం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బొమ్మరవేణి తిరుపతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఆడెపు మనోజ్ కుమార్, పూరేళ్ళ రాజశేఖర్ లతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఒక్కరి నిర్లక్ష్యం కుటుంబాన్ని రోడ్డున పడేస్తుంది

- ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో మృతి
- ప్రమాదాలు విధి కాదు - మన నిర్లక్ష్య ఫలితమే

**మెదక్, మార్చి 30 (ప్రజా తీర్పు ):**



మెదక్: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా మోనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఎస్ అగర్వాల్ కంపెనీలో "ూతీతీఅజవ ూశ్రీఅజవ" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా మాత్రమే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నారని, హెల్మెట్ ధరించకపోవడం వల్ల మరణాలు అధికంగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని స్పష్టం చేశారు. ఇంటి పెద్ద రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని, ఒక్కరి నిర్లక్ష్యం వల్ల కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. "ప్రమాదం ముందస్తుగా చెప్పి రాదు" అనే విషయాన్ని గుర్తుంచుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు.దేశవ్యాప్తంగా ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశంలో రోజుకు సగటున సుమారు 450 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతుండగా, గత సంవత్సరం దేశవ్యాప్తంగా సుమారు 1.6 లక్షల మంది ప్రాణాలు కోల్పోయి, 3 లక్షల మంది గాయపడ్డారని వివరించారు. మెదక్ జిల్లాలో గత సంవత్సరం 287 మంది మృతి చెందగా, 631 మంది గాయపడ్డారని తెలిపారు. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదని, ప్రతి ప్రమాదం వెనుక ఒక కుటుంబం కన్నీరు ఉందని అన్నారు. జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 60 శాతం ద్విచక్ర వాహనాలకు సంబంధించినవేనని వెల్లడించారు. జిల్లాలో గత సంవత్సరం చేపట్టిన వాహన తనిఖీల ద్వారా సుమారు 69 రోడ్డు ప్రమాద మరణాలను నివారించగలిగామని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేయడం ద్వారా ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ--- ద్విచక్ర వాహనదారులు రైడర్, పిలియన్ ఇద్దరూ ×ూ× ప్రమాణిత హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయరాదని, ఎడమ వైపు నుంచి ఓవర్టేక్ చేయకూడదని తెలిపారు. ఇటీవల శంకరంపేట్ మండలంలో జరిగిన ఒకే బైక్ ప్రమాదంలో నలుగురు మృతి చెందిన ఘటనను ఉదాహరణగా పేర్కొంటూ, ప్రమాదాల ముందు ఎవరూ అతీతులు కారని అన్నారు. చివరగా, ప్రమాదాలు విధి కాదని, మన నిర్లక్ష్య ఫలితమేనని స్పష్టం చేస్తూ--- మన కుటుంబాల భద్రత కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఎస్పీ కోరారు. కార్యక్రమం ముగింపులో సిబ్బంది, కార్మికులతో రోడ్డు భద్రతపై అవగాహనా ప్రతిజ్ఞ చేయించారు. ఇదే కార్యక్రమంలో తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తొమ్మిది తులాల బంగారాన్ని నిజాయితీగా పోలీసులకు అందించిన నాగరాజును జిల్లా ఎస్పీ అభినందించి శాలువాతో సన్మానించి బహుమతి అందించారు. అదేవిధంగా వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగను చాకచక్యంగా పోలీసులకు పట్టించిన వ్యక్తిని కూడా జిల్లా ఎస్పీ శాలువాతో సన్మానించి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్, సిఐ లు సందీప్ రెడ్డి కృష్ణమూర్తి రంగకృష్ణ, ఎసై లు సుభాష్ గౌడ్, గంగరాజు, రాజు, ఎంఎస్ అగర్వాల్ అధికారులు, కార్మికులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెన్షన్ పెంచాలని కోల్ పెన్షనర్స్






- ధర్నాకు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం సంగిభావంగా , మద్దతుగా ధర్నా.
- మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా వద్ద సింగరేణి విశ్రాంత ఉద్యోగుల భారీ నిరసన ప్రదర్శన

**(దండే భూమన్న ప్రజాతీర్పు మంచిర్యాల) మార్చి 30**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా అంబేద్కర్ విగ్రహం ఆవరణలో కోల్ ఇండియా లోని బొగ్గు పెన్షన్లకు పెన్షన్ పెంపుదల చేయాలనే డిమాండ్ తో న్యూ ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద కోల్ పెన్షనర్లు చేస్తున్న ధర్నాకు మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం. ఢిల్లీ లో వారు చేస్తున్న ధర్నా కు సంఘీభావం తెలుపుతూ మద్దతుగా ఈరోజు న నల్ల బ్యాడ్జ్ లు ధరించి ప్లే కార్డ్స్ చేత పూని పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 1998 సంవత్సరం లో చేసుకున్న ఒప్పందం మేరకు ప్రతి మూడు సవత్సరాలకు ఒకసారి మార్కెట్ లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంచాలని అగ్రిమెంట్ ఉన్న గత 28 సంవత్సరాల నుండి ఒక శాతం పెన్షన్ పెంచకపోవడం పట్ల తీవ్రంగా ఖండించారు. కరువు భత్యం తో కూడిన 50% శాతం కోల్ మైన్స్ పెన్షన్ పెంచాలని ఈ సందర్భంగా డిమాండ్ చేసినారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు కనీస పెన్షన్ గా 15,000 వేలు చెల్లించాలని డిమాండ్ చేసినారు. 1998 పెన్షన్ ఒప్పందం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పెన్షన్ స్కీం సవరించి పెన్షన్ పెంచాలని డిమాండ్ చేసినారు. అదే విధంగా జూవీ=హా హెల్త్ కార్డు కు సంబంధించి 8 లక్షలకు బదులు 25 లక్షలు వైద్య సౌకర్యాలు కలిపించాలని డిమాండ్ చేసినారు. 2017 జనవరి నుండే పెరిగిన గ్రాడ్యుటీ సీలింగ్ 20 లక్షలు విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాలని కోరినారు. గోల్డెన్ అండ్ షేక్ హ్యాండ్ పెట్టుకున్న ఉద్యోగులకు ప్రభుత్వాలు ఉచితంగా ఇచ్చే ఆసరా పెన్షన్ కన్నా అతి తక్కువ 350-1000 రూపాయిల పెన్షన్ పొందుతున్న వారు వేలాది మంది ఉన్నారనే విషయాన్ని ప్రభుత్వాలు , కోల్ ఇండియా యాజమాన్యం గుర్తించాలని పేర్కొన్నారు. అదే విధంగా అతి తక్కువ పెన్షన్ పొందుతున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం ఆసరా పెన్షన్లు చెల్లించాలని , ఇల్లు లేని విశ్రాంత ఉద్యోగులకు డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలని , అరుహులైన వారికి తెల్ల రేషన్ కార్డులు, రాజీవ్ ఆరోగ్య శ్రీ కార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. అదే విధంగా సింగరేణి లో మారుపేర్లను మార్చాలని , నూతన అండర్గ్రౌండ్ బొగ్గు బావులను ప్రారంభించాలని , సింగరేణి లో మెడికల్ బోర్డు ను వెంటనే ప్రారంభించాలని , ఏరియా హాస్పిటల్ లో గతంలో మాదిరిగానే ఇన్ పేషెంట్ లకు ఉచితంగా వైద్య సౌకర్యాలు అందించాలని డిమాండ్ చేసినారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధులైన సింగరేణి పెన్షనర్స్ మంచిర్యాల శ్రీరాంపూర్ మందమర్రి రామకృష్ణపూరి బెల్లంపల్లి ప్రాంతాల నుంచి వయోభారాన్ని లెక్కచేయకుండా పెన్షన్ పెంపుదాల కోసం అదేవిధంగా మిగతా సమస్యల పరిష్కారం కోసం అధిక సంఖ్యలో సింగరేణి విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. వయోభారం తో పాటు వృద్యాప్యం లో వచ్చే రోగాలకు వైద్య ఖర్చులు , మార్కెట్ లో పెరిగే ధరల వలన కనీస ప్రాథమిక అవసరాలకు కూడా మాకు వచ్చే పెన్షన్ సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తపరిచినారు. ద్రవ్యోల్మానం 300 శాతం గణనీయంగా పెరిగినను కరువు భత్యం లేని పెన్షన్ సరిపోక దారిద్యం లోకి త్రోసి వేయడం వలన గౌరవప్రదమైన జీవితాలను గడుపుట కష్టపరంగా ఉందని సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేసినారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షులు రాళ్ల బండి రాజన్న, ఉపాధ్యక్షుడు పానగంటి పోషం , సలహాదారుడు మహేందర్ రాజు , మందమర్రి ఏరియా నాయకులు రామ్ రావేందర్ , ఆడెపు రాజేశం , రేణికుంట కొమురయ్య , బి రాజన్న , శ్రీరాంపూర్ నాయకుడు బింగి రాజేశం , గజెల్లి సుదర్శన్ , మేకల రమేష్ , బెల్లంపల్లి నాయకుడు శ్రీనివాస్ , రామకృష్ణాపూర్ ఏరియా నాయకుడు కాలువల నర్సయ్య, కార్యదర్శి అడిచర్ల రాజేశం , కేంద్ర కమిటీ నాయకులు రమేష్ జుఞ హాధూజ , మురహరి , నిచ్చకోళ్ల అంజన్న , పోతరాజుల చంద్రయ్య , రాంబాబు , గోపతి లక్ష్మణ్ , సర్వేశ్వర చారి , దేవులపల్లి రామస్వామి , రాజన్న గౌడ్ , భీంసేన్ , హనుమాండ్ల బుచ్చయ్య , విఘ్నేష్ , రాజ్ మొహమ్మద్ , చుక్క నారాయణ , కె దేవయ్య , ఎంఎస్ అలీ భేగ్, మంచాల రామయ్య , గుజ్జ శంకర్ , తదితరులు పాల్గొన్నారు.

## కోటి రూపాయల విలువైన హాషీష్ ఆయిల్ స్వాధీనం -- ఒకరి అరెస్ట్

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) మార్చి.30**



రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం పోలీసులు మరియు స్పెషల్ ఆపరేషన్ టీమ్ ( ఎస్ఓటి ) బృందం సమిష్టిగా నిర్వహించిన తనిఖీలలో భారీగా యాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు . ఒరిస్సా నుండి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న దాదాపు 9.402 కిలోల హాషీష్ ఆయిల్ (గంజాయి ద్వారా తయారు చేసే నూనె)ను పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ. 1 కోటి రూపాయలు నిందితుల ఏ -1: కొరాబు చాంటి బాబు (35 సంవత్సరాలు) -- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అల్లూరి సీతారామరాజు జిల్లా నివాసి (అరెస్ట్) ఇా-2: రాజారావు (ఒరిస్సా) -- పరారీలో ఉన్నారు ఏ -3: గుర్తుతెలియని వ్యక్తి -- పరారీలో ఉన్నారు , ఏ -1 చంటి బాబు, ఏ -2 రాజారావు వద్ద నుండి ఈ డ్రగ్స్‌ను సేకరించి హైదరాబాద్‌లోని గుర్తుతెలియని వ్యక్తులకు సరఫరా చేయడానికి ప్రయత్నించాడు. మార్చి 29 సాయంత్రం మహేశ్వరం గేట్ బస్ స్టాప్ వద్ద నిలబడి ఉన్న సమయంలో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 10 పాలిథిన్ కవర్లలో ఉన్న హాషీష్ ఆయిల్ మరియు 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు చంటి బాబుపై గతంలో ఆంధ్రప్రదేశ్‌లోని కంచరపాలెం, అనకాపల్లి, విశాఖపట్నం ప్రాంతాలలో 4 కేసుల్లో నిందితుడు,( ఎన్ డి పి ఎస్ ) కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి:**

యువత మరియు విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తగా , తమ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని కోరారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే మహేశ్వరం జోనల్ కంట్రోల్: 8712662664 లేదా డయల్ 100కు సమాచారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆపరేషన్‌లో ప్రతిభ కనబరిచిన అధికారులను పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపిఎస్ మరియు ఇతర ఉన్నతాధికారులు అభినందించారు.

## అన్నదానం చేసే అవకాశం రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నా

- 17వ విడత అన్నదానానికి ఆర్థిక సాయం అందించిన శిరీష కృష్ణారెడ్డికి ధన్యవాదాలు
- టిఆర్పిఎస్ అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని

**(మొక్క ఉపేందర్, ప్రజా తీర్పు ప్రతినిధి హైదరాబాద్) మార్చి 30**



అన్ని దానాల కెల్లా అన్నదానం గొప్పదని అన్నదానం చేసే అవకాశం భగవంతుడు మాకు కల్పించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని తెలంగాణ రైతు పరిరక్షణ సమితి అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని అన్నారు. రైతు కుటుంబం నుండి వచ్చిన నేను అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. సోమవారం మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ కార్యాలయం వద్ద 17వ విడత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి సమస్యల పరిష్కారం కోసం వచ్చే బాధితుల కోసం గత 16 వారాలుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అన్నదానం చేయడం అందరికీ అవకాశం రాదని తమ సంస్థ కు రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. 17వ విడత అన్నదాన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అలియాబాద్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ కమటం శిరీష కృష్ణారెడ్డి ఆర్థిక సహకారం అందించారని వారికి సంస్థ తరఫున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇటువంటి మానవతా దృక్పథం కలిగిన వారు మాకు సహకారం అందించడం వలన మేము నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించగలుగుతున్నామని తెలిపారు. సుమారు 100 మందికి అన్నదాన కార్యక్రమం అందిస్తున్నామని మరి కొంతమంది దాతలు ముందుకు వచ్చి మాకు సహకారం అందిస్తే ఎక్కువ మందికి అన్నదానం అందించలుగుతామని భవాని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఇంద్రపాల సత్యనారాయణ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు దావత్ అరుణ్ కుమార్, అంబాల విష్ణు, అధికార ప్రతినిధులు చిక్కుడు నరసింహ, అంబాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## కెసిఆర్ కేటీఆర్ ను కలిసి పెళ్లి పత్రిక అందజేసిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మార్చి 30**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రివర్యులు, బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కెసిఆర్ ని మరియు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని కలసి ఏప్రిల్ 12వ తేదీన జరిగే తమ కూతురి వివాహానికి హాజరై ఆశీర్వదించాలని కోరుతూ పెళ్లిపత్రిక అందచేసి వారి ఆశీర్వాదం తీసుకున్న బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, వారి కుటుంబసభ్యులు



## ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ కలెక్టర్ గరిమ అగ్రవాల్.



**(పాష సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) మార్చి 30**

ప్రజావాణిలో అర్జీలు కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్వీకరించి.. పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 205 అర్జీలు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేశారు. జిల్లా పౌర సరఫరాల శాఖ, జిల్లా వైద్యాధికారి, నీటి పారుదల శాఖ అధికారికి మూడు చొప్పున, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, డీఎం ఆర్టీసీ సిరిసిల్ల, సెస్ ఎండీకి రెండు చొప్పున, చేనేత అండ్ జౌళి శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, బీసీ సంక్షేమ అధికారి, జిల్లా విద్యాధికారి, అటవీ శాఖాధికారి, మైనింగ్ అధికారి, జిల్లా ఎక్సైజు అధికారి, యువజన అండ్ స్పోర్ట్స్ అధికారి, ఈడీఎం, జీజీహెచ్ సిరిసిల్ల, సబ్ రిజిస్ట్రార్ సిరిసిల్ల, మెప్మా కార్యాలయానికి ఒకటి చొప్పున రాగా.. వాటిని సంబంధిత కార్యాలయాలకు పంపించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు పాల్గొన్నారు.

### తైక్వాండోలో పవర్ హౌజ్ లిటిల్ చాంప్స్ ప్రతిభ

నగరంలో ఈనెల 28-29 తేదీల్లో జరిగిన 14వ తెలంగాణ ఓపెన్ స్టేట్ లెవల్ ఇంటర్ స్కూల్ తైక్వాండో చాంపియన్‌షిప్-2026 పోటీల్లో పవర్ హౌజ్ తైక్వాండో అకాడమీ లిటిల్ చాంప్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి పతకాల పంట పండించారు. రాష్ట్రం నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్న ఈ టోర్నీలో పవర్ హౌజ్ అకాడమీ మొత్తం 16 పతకాలతో సత్తాచాటింది. అకాడమీ నుంచి 19 మంది క్రీడాకారులు బరిలో నిలువగా వారిలో ఏకంగా 16 మంది మెడల్స్ నెగ్గడం గమనార్హం. పవర్ హౌజ్ జట్టు క్యోరుగు, పూమ్సే విభాగాల్లో 9 బంగారు పతకాలు, ఒక రజతం, 6 కాంస్యాలు సాధించింది.

## చీరకట్టులో చూడముచ్చటగా.. ఈషా రెబ్బా స్టన్నింగ్ ఫొటోస్





తెలుగు ముద్దుగుమ్మ ఈషా రెబ్బా ఎప్పటి నుంచో సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తుంది. వరుసగా సినిమాలు చేస్తున్నా హిట్స్ మాత్రం అందుకోలేకపోతోంది ఈ చిన్నది. హీరోయిన్ గా సినిమాలు చేస్తూనే సెకండ్ హీరోయిన్ గానూ నటిస్తూ మెప్పిస్తుంది. చిన్న చిన్న సినిమాల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ వయ్యారికి ఇప్పటివరకు సరైన బ్రేక్ మాత్రం రాలేదు. తెలుగు ముద్దుగుమ్మ ఈషా రెబ్బా ఎప్పటి నుంచో సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తుంది. వరుసగా సినిమాలు చేస్తున్నా హిట్స్ మాత్రం అందుకోలేకపోతోంది ఈ చిన్నది. హీరోయిన్ గా సినిమాలు చేస్తూనే సెకండ్ హీరోయిన్ గానూ నటిస్తూ మెప్పిస్తుంది. చిన్న చిన్న సినిమాల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ వయ్యారికి ఇప్పటివరకు సరైన బ్రేక్ మాత్రం రాలేదు. అలాగే పెద్ద స్టార్ హీరోల సినిమాల్లో సెకండ్ హీరోయిన్ గా కనిపించింది. ఒక్క హిట్ పడితే కెరీర్ టర్న్ అవుతుందని ఎదురుచూస్తుంది ఈ అందాల భామ. అంతకు ముందు ఆ తర్వాత సినిమాతో కథానాయికగా తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు.. ఆతర్వాత వరుసగా అమీ తుమీ, విస్మయం, బ్రాండ్ బాబు వంటి చిత్రాల్లో నటించింది.



Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020